teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 152 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 27 నవంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## ఐబొమ్మ కేసులో కీలక పరిణామం




- పీటీ వారెంట్‌పై అరెస్టు, నాంపల్లి కోర్టులో హాజరు
- ప్రధాన నిందితుడు రవికి 14 రోజుల రిమాండ్
- మళ్లీ చంచల్‌గూడ జైలుకు తరలింపు
- రవిపై ఇప్పటివరకు నమోదైన 5 కేసులు



## కేబినెట్‌లో స్కీముల ఊసేది

అంతా స్కాముల కోసమే రామగుండం ప్రాజెక్టులో భారీ కుంభకోణం రేవంత్ సర్కార్‌పై హరీష్ రావు ధ్వజం

.. వివరాలు 2లో



## 9 భారతీయ భాషల్లో రాజ్యాంగం

డిజిటల్ వెర్షన్ విడుదల రాష్ట్రపతి చేతుల మీదుగా ఆవిష్కరణ పార్లమెంటు లైబ్రరీలో ఘనంగా అసలు ప్రతులు

.. వివరాలు 2లో




# నివాస ప్రాంతాల మద్యం దుకాణాలా?

### మద్యం దుకాణాలను పెంచుకుంటూ పోతే

### రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుంది

### మద్యం దుకాణాలను పెంపుపై హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

రాష్ట్రంలో మద్యం దుకాణాలను పెంచడం పట్ల తెలంగాణ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సత్యనారాయణ కాలనీలో నివాసాల మధ్య మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం పట్ల అక్కడి స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇటీవలే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.




02

## మహిళలు ఇందిరమ్మ చీరలు తీసుకుంటుంటే.. బిఆర్ఎస్ నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు

- సిరిసిల్ల నేతన్నల చేతి వృత్తిని అవమానించడం తగదు
- మహిళా సంఘాలకే పంపిణీ ఆరోపణలు అవాస్తవం
- రాజకీయ కక్ష సాధింపుపై మంత్రి సీతక్క ఆగ్రహం



హైదరాబాద్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ చీరలపై దుష్ప్రచారం చేయడం తగదని, ఓర్వలేకనే బిఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డలు, మహిళా సంఘాలు ఎంపిక చేసుకున్న డిజైన్లలోనే చీరలను ఇస్తున్నామని, అయినా మిగతా 2 లో

## ఆర్టీసీ టికెట్ల ధరల పెంపుపై వివాదం

### సెస్ పేరుతో భారం పడుతోందని నెటిజన్ల విమర్శ





- మెట్రో ఎక్స్‌ప్రెస్ ధరల పెంపుపై ఆర్టీసీ ఖండన
- సోషల్ మీడియా ప్రచారం అవాస్తవం
- స్పష్టం చేసిన టీజీఎస్ఆర్టీసీ

తెలంగాణ బ్యూరో, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): టీజీఎస్ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సు టికెట్ ధరలను మిగతా 2 లో

## ప్రపంచ అత్యుత్తమ నగరాల జాబితా విడుదల

- భారత్‌కు నాలుగు స్థానాలు
- జాబితాలో హైదరాబాద్ 82వ ర్యాంక్
- లండన్‌కు వరుసగా 11వ సారి మొదటి స్థానం
- టాప్ 8లో న్యూయార్క్, ప్యారిస్, సింగపూర్ నగరాలు
- రెసోనెన్స్ కన్సల్టెన్సీ ఇప్సాస్ నివేదికలో వెల్లడి

02



## ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్




- రూ.1,300 కోట్లతో సాఫ్రాన్ మెగా ప్రాజెక్ట్ ప్రారంభం
- వెయ్యి మంది నిపుణులకు ఉపాధి
- తెలంగాణ రాష్ట్రం నుంచి రెట్టింపైన ఎగుమతులు
- ప్రధానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి
- బెంగళూరు-హైదరాబాద్‌ను డిఫెన్స్ కారిడార్‌గా గుర్తించాలి

02



## ట్రాఫిక్ చలాన్లపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- రాయితీలు చట్టభయాన్ని బలహీనపరుస్తాయి
- ఇంటిగ్రేటెడ్ ఈ-చలానా వ్యవస్థపై హైకోర్టులో పిటిషన్
- చలానా నిబంధనల పొందుపర్చడంపై ఆదేశం

.. వివరాలు 2లో

## తెలంగాణ పరిస్థితిపై కేఏ పాల్ ఆందోళన

- ప్రజాశాంతి పార్టీయే ప్రత్యామ్నాయం
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
- కాంగ్రెస్ ఎన్నికల హామీలు నెరవేర్చలేదు: కేఏ పాల్ ఆగ్రహం



హైదరాబాద్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): బుధవారం అమీర్ పేట్ లోని ప్రజాశాంతి పార్టీ ఆఫీసులో నిర్వహించిన మీటింగ్ లో మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు కేఏ పాల్. తెలంగాణ పరిస్థితి ఘోరంగా ఉందని లక్షల కోట్ల విలువైన భూములు అమ్ముకొని బినామీలకు అంటగడుతున్నారని మిగతా 4 లో



## 2030 కామన్వెల్త్ క్రీడల వేదికగా అహ్మదాబాద్

02

- గ్లాస్గో జనరల్ అసెంబ్లీలో అధికారిక ఆమోదం
- 2036 ఒలింపిక్స్ నిర్వహణ ఆశయానికి కీలక మలుపు

## ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం

- విద్యార్థుల వివరాల సవరణపై నూతన మార్గదర్శకాలు
- పరీక్ష సమయంలో తప్పులను సరిదిద్దుకునే విధానానికి స్వస్తి
- విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో వివరాల క్రాస్ చెకింగ్
- ప్రిన్సిపాళ్లకు ప్రత్యేక ఆదేశాలు



తెలంగాణ బ్యూరో, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి మిగతా 2 లో

## లొంగిపోయిన 41 మంది కీలక మావోయిస్టు నేతలు

- 32 మంది కీలక మావోయిస్టులపై ₹1.19 కోట్ల రివార్డు
- తక్షణ ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి ₹50,000 నగదు పంపిణీ

.. వివరాలు 2లో

# నివాస ప్రాంతాల మద్యం దుకాణాలా?



హైదరాబాద్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో మద్యం దుకాణాలను పెంచడం పట్ల తెలంగాణ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సత్యనారాయణ కాలనీలో నివాసాల మధ్య మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం పట్ల అక్కడి స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇటీవలే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలోనే వారి పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇలా ఇష్టానుసారంగా మద్యం దుకాణాలను పెంచుకుంటూ పోతే తెలంగాణ రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుందని కామెంట్ చేసింది. మద్యం దుకాణాల నియంత్రణపై తమకు పూర్తి అధికారాలు లేనప్పటికీ విధానపరమైన నిర్ణయం తీసుకునే వరకు ఆదేశాలు జారీ చేస్తామని హైకోర్టు పేర్కొంది. ఇప్పటికే కనీసం రహదారిపైకి మద్యం దుకాణాలు కనిపించకుండా ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉన్నా పట్టించుకోరా అని ఫైర్ అయింది. ఇక నాగారం మున్సిపాలిటీ లో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై వివరణ ఇవ్వాలని మున్సిపల్, ఎక్సైజ్ అధికారులు, షాపు యజమానులకు తెలంగాణ హైకోర్టు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

# మహిళలు ఇందిరమ్మ చీరలు తీసుకుంటుంటే.. బిఆర్ఎస్ నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు



మొదటి పేజీ తరువాయి

కలర్, డిజైన్ బాగాలేదని బిఆర్ఎస్ వాళ్లు విమర్శిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. సహజంగా ఆడవాళ్లు ఎదుగుతుంటే కెటిఆర్, హరీశ్‌రావులు ఓర్వలేరని మంత్రి సీతక్క విమర్శించారు. ఆడబిడ్డలు చీరలు తీసుకొని సంబరపడుతుంటే వారు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని మంత్రి సీతక్క దుయ్యబట్టారు. బిఆర్ఎస్ మాదిరిగా ఇవి సూరత్ నుంచి కిలోల లెక్కన తీసుకొచ్చిన చీరలు కాదని, సిరిసిల్ల నేతన్నలు తమ చేతితో స్వయంగా నేసిన చీరలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కావాలంటే కెటిఆర్, హరీష్‌రావు, కవితలు స్వయంగా సిరిసిల్ల వెళ్లి నేతన్నలను అడిగి తెలుసు కోవాలని మంత్రి సీతక్క సూచించారు. కొందరు బిఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు కావాలని చీరలు బాగా లేవంటూ మాట్లాడటం సిరిసిల్ల నేతన్నలను అవమానించేలా ఉందన్నారు. చీరలను మహిళా సంఘాల వారికే ఇస్తున్నామని ఆరోపణలు అవా స్తవమని మహిళా సంఘాల సభ్యులకు ఇస్తూనే సభ్యత్వం లేని వారిని సైతం సంఘంలోకి ఆహ్వానిస్తూ వారికి సారె పెడుతున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# ఆర్టీసీ టికెట్ల ధరల పెంపుపై వివాదం

మొదటి పేజీ తరువాయి

పెంచింది అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆర్టీసీ ఖండించింది. గతంలో 30 రూపాయలు ఉన్న దూరానికి ఇప్పుడు ఏకంగా రూ. 45 వసూలు చేస్తున్నారని ఒకేసారి రూ. 15 పెంచడం దారుణం అని ఈ విషయంలో ప్రతిపక్ష నేత కేటీఆర్ అసెంబ్లీ వేదికగా స్పందించాలంటూ ఓ నెటిజన్ చేసిన పోస్టు వైరల్ గా మారింది. ఈ పోస్టుపై కేటీఆర్ సైతం స్పందించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి వివరాల మేరకు ఈ విషయంలో తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ అధికారిక వివరణ ఇచ్చింది. ఈ వివరాల ప్రకారం సోషల్ మీడియా లో కొందరు తెలంగాణ రాష్ట్ర రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సు టికెట్ ధరలను పెంచింది అని ప్రచారం చేసారు. అందులో ఎలాంటి నిజం లేదు. ప్రస్తుత అవసరానికి అనుగుణంగా అక్టోబర్ 6, 2025 న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆర్టీసీ నడిపే బస్సుల్లో టికెట్లపై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ విధించాం. కానీ ఆ తరవాత, తెలంగాణ లో ఆర్టీసీ నడిపే బస్సుల్లో ఎలాంటి టికెట్ ధరలను పెంచలేదు. సాధారణంగా, ఆర్టీసీ బస్సు టిక్కెట్ల ధరల పెరుగుదల డీజిల్ ధరకు నేరుగా అనుసంధానంగా పెరుగుతాయి. ఇంధన ధరలు పెరిగినప్పుడల్లా, టీజీఎస్ఆర్టీసీ ధరల పెరుగుదలను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి లేఖ రాస్తాం. కానీ చాలా సందర్భాల్లో, టికెట్ ధరల పెంచడం వల్ల ప్రయాణికులకు కలిగే అసౌకర్యాని దృష్టిలో ఉంచుకుని ఆ ప్రతిపాదనను తిరస్కరిస్తాం. కాకపోతే, టికెట్లపై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ వసూలు చేస్తున్నా విషయం చాల కాలం తరవాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న వారికి తెలియకపోవచ్చు అని నాగిరెడ్డి తెలిపారు' అంటూ టీజీ ఫ్యాక్ట్ చెక్ వివరణ ఇచ్చింది. దీనిపై నెటిజన్లు స్పందిస్తున్నారు. ధరల పెంపును మీరు సెస్ అని పిలవండి లేదా ఇంకేమైనా పిలవండి. కానీ ప్రజలమ మీద భారం పడుతోందా లేదా అని ఓ నెటిజన్ ప్రశ్నించారు. మరో నెటిజన్ రియాక్ట్ అవుతూ నిన్న పెంచామా మొన్న పెంచామా అన్నది కాదు టికెట్ ధరలు పెరిగాయనేది జనాల బాధ అని కామెంట్ చేశారు.

# కేబినెట్‌లో స్కీముల ఊసేది




హైదరాబాద్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): కేబినెట్ లో స్కాముల గురించి తప్ప స్కీముల గురించి చర్చించడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా విద్యుత్ కుంభకోణానికి తెరలేపారని, కాంగ్రెస్ పాలనలో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపించారు. ఒక్క రామగుండం ప్రాజెక్టులోనే రూ.5-6 వేల కోట్ల కమీషన్ దండుకునేలా ప్లాన్ చేశారన్నారు. మంత్రులకు కమీషన్ల పంపకాల కోసమే కేబినెట్ మీటింగ్స్ జరుగుతున్నాయని, ప్రజల సమస్యలు, అమలు చేయాల్సిన పథకాలపై చర్చించడం లేదని దుయ్యబట్టారు. ఎన్టీపీసీ ఒప్పందంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల వీడియోను ప్లే చేసి చూపించారు. ఎన్టీపీసీ ఒప్పందంపై మాట్లాడిన మాటలనే ఉదహరిస్తూ.. రామగుండం 800 మెగావాట్ల ప్రాజెక్టుకు యూనిట్ కు రూ.8 చొప్పున రూ.10,880 కోట్లు ఖర్చవుతుందని చెప్పారని, ప్రాజెక్టు పూర్తయ్యేసరికి రూ.15 వేల కోట్ల వరకూ ఖర్చువుతుందన్నారు. అప్పుడు ఒక యూనిట్ కు రూ.10 ఖర్చవుతుందన్నారు. రూ.5కే యూనిట్ విద్యుత్ అందిస్తామన్న సీఎం.. రామగుండం యూనిట్ ను అంత ఖర్చుతో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. గతంలో ప్రతిపక్షనేతగా రేవంత్ థర్మల్ ప్లాంట్లను వ్యతిరేకించి, ఇప్పుడు సీఎంగా థర్మల్ ప్లాంట్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో ఎవరు ఏ సమస్యపై ప్రశ్నించినా సీఎం నన్ను కోసుకుని తింటారా? అని అడుగుతున్నారన్నారు. పాల్వంచ, రామగుండం, మత్కల్ .. మూడు ప్రాంతాల్లో ఒక్కో చోట 800 మెగావాట్ల చొప్పున 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్లు పెడతానని సీఎం అంటున్నారని, అందుకు సుమారుగా రూ.50 వేల కోట్లు ఖర్చవుతుందన్నారు. వీటిలో రూ.40 వేల కోట్లు అప్పుగా తీసుకువచ్చినా.. రూ.10 వేలకోట్లు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిగా పెట్టాలన్నారు రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్ మెంట్, ఎస్సీ,ఎస్టీ బీసీలకు స్కాలర్ షిప్, ఉద్యోగుల డీఏ పెంపులపై ఫైర్ అయిన రేవంత్ రెడ్డి ఈ రూ.10 వేల కోట్లను ఎక్కడి నుంచి తీసుకొస్తారని హరీష్ రావు ప్రశ్నించారు. ఢిల్లీకి అప్పుల కోసం వెళ్తుంటే చెప్పులు ఎత్తుకపోయేవాడిలా తనను చూస్తున్నారన్న రేవంత్ రెడ్డికి.. అప్పు ఎవరిస్తారని ప్రశ్నించారు. ఎన్టీపీసీ 2400 మెగావాట్ల కరెంట్ ను ఉత్పత్తి చేశామని, తమతో పీపీఏ ఒప్పందం చేసుకుంటే తక్కువ ధరకే విద్యుత్ ను అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి మూడు ఉత్తరాలు రాసినా రేవంత్ సర్కార్ స్పందించలేదని విమర్శించారు. ఆ సంస్థ సీఎండీ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కూడా దీనిపై రిక్వెస్ట్ చేశారని, గతంలో బీఆర్ఎస్ సర్కార్ 1600 మెగావాట్ల విద్యుత్ ను తీసుకుందని, మిగతా 2400 మెగావాట్లను సప్లై చేస్తామన్న స్పందించలేదని తెలిపారు.

# ట్రాఫిక్ చలాన్లపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు


హైదరాబాద్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వారికి చలానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు పలు సందర్భాల్లో రాయితీపై చలాన్లు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ ప్రక్రియపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినవారికి చలానాలు విధిస్తూ తరువాత అందులో రాయితీలు ఇవ్వడం చట్ట పరిణామాలపై ఉన్న భయాన్ని బలహీనపర్చడమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ రాయితీలు ఇవ్వడం ట్రాఫిక్ క్రమశిక్షణరాహిత్యాన్ని పెంచుతుందని పేర్కొంది. ఇంటిగ్రేటెడ్ ఈ-చలానా వ్యవస్థను సవాల్ చేస్తూ హైదరాబాద్ తార్నాకకు చెందిన వి. రాఘవేంద్రచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారించారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ ట్రిపుల్ రైడింగ్‌కు 1988 మోటారు వాహనాల చట్టం సెక్షన్ 128 రెడ్‌విత్ 177 ప్రకారం రూ. 100 నుంచి రూ. 300 మాత్రమే జరిమానా విధించాలి. కానీ, దీనికి విరుద్ధంగా 2019 నిబంధన ప్రకారం రూ. వెయ్యి విధిస్తున్నారని అన్నారు. ఇది చెల్లదని వాదించారు. 2019లో సవరణ నిబంధనలను తెలంగాణ ప్రభుత్వం అన్వయించుకోకపోవడంతో 1988 నిబంధనల ప్రకారమే చలానా జారీచేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ న్యాయవాది మహేశ్ రాజె తమ వాదనలు వినిపించారు. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 200 కింద ట్రాఫిక్ ఉల్లంఘనలనేవి జరిమానా విధించదగ్గ నేరాలని తెలిపారు. అందుకు సంబంధించిన జరిమానాల వివరాలను వెల్లడిస్తూ ప్రభుత్వం 2007 జీవో 54 జారీ చేసిందని హైకోర్టుకు తెలిపారు. హైకోర్టు సూచనల మేరకు ప్రభుత్వం జరిమానాను పెంచుతూ 2011లో ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రస్తుత చలానా వ్యవస్థలో నిబంధనలన్నీ పొందుపర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. కేంద్ర మోటారు వాహన నిబంధన 167 కింద ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి నిబంధనలతో సహా చలానాలు జారీచేయాల్సి ఉందన్నారు. ఈ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది చెబుతున్నందున అది ఏ దశలో ఉందో వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను డిసెంబరు 9వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

# 9 భారతీయ భాషల్లో రాజ్యాంగం




తెలంగాణ బ్యూరో, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్‌న్యూస్ వచ్చింది. ఇప్పుడు రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు సులువుగా అర్థం చేసుకునే రోజు వచ్చింది. తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగాన్ని తొమ్మిది భాషలలో డిజిటల్‌గా విడుదల చేశారు. తెలుగు భాష సహా.. మరాఠీ, నేపాలీ, పంజాబీ, బోడో, కశ్మీరీ, ఒడియా, అస్సామీ, మలయాళంలో రాజ్యాంగాన్ని అనువాదించారు. ఈ రోజు మొత్తం దేశం రాజ్యాంగ నిర్మాతలకు గౌరవం ఇచ్చే రోజు అని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం భారతదేశానిది. ఇందులో 26 భాగాలు, 12 షెడ్యూళ్లు 448 అధికకరణలు ఉన్నాయి. రాజ్యాంగం ఇంగ్లీషు ప్రతిలో దాదాపు 1,17,369 పదాలున్నాయి. ఇంగ్లీషు, హిందీ రెండు కాపీలు చేతితోనే రాశారు. హిందీ, ఇంగ్లీషులో రాసిన రాజ్యాంగం అసలు కాపీలు హీలియంతో నింపిన ప్రత్యేకమైన కేసుల్లో పార్లమెంటు లైబ్రరీలో భద్రపరిచారు. రాజ్యాంగ ప్రతులను ప్రేమ్ బిహరీ నారాయణ్ అనే వ్యక్తి ఇటాలిక్ శైలిలో అందంగా రాశారు. ఇందుకోసం ఆయన ఆరు నెలల సమయాన్ని వెచ్చించి దాదాపు 254 పాళీలు ఉపయోగించారు. ఇందుకు ప్రతిఫలంగా ఏమి తీసుకోని ప్రేమ్ బిహారీ.. కేవలం తన పేరును ప్రతిపేజీలో ఉండేలా కోరారు. భారత రాజ్యాంగం అధికారికంగా అమల్లోకి వచ్చింది 1950 జనవరి 26 అన్న విషయం అందరికి తెలుసు. అందుకే ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవం నిర్వహిస్తారు. అయితే 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా పరిగణిస్తారు. 1950 జనవరి 26 ఉదయం 10:18 గంటలకు రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత గణతంత్ర రాజ్యంగా అవతరించింది భారత్. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సమయంలో దాదాపు 283 రాజ్యాంగసభ సభ్యులు సంతకం చేసారు. ఆ సమయంలోనే వర్షంపడటంతో చాలామంది దాన్ని దేశానికి శుభసూచకంగా భావించారు. అదే రోజు అంటే 1950 జనవరి 26న గణతంత్ర భారత్‌కు తొలి రాష్ట్రపతిగా డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. అదే సమయంలో స్వతంత్ర భారత్‌కు తొలి న్యాయశాఖ మంత్రిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్యవహరించారు. తొలి గణతంత్ర దినోత్సవానికి ఇండోనేసియా అధ్యక్షుడు సుకర్నో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1955లో జనవరి 26న తొలిసారి గణతంత్ర పరేడ్ నిర్వహించారు.

# ప్రపంచ అత్యుత్తమ నగరాల జాబితా విడుదల



న్యూ ఢిల్లీ, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల జాబితాలో భారత్ కు సంబంధించిన నాలుగు సిటీలకు చోటు దక్కింది. హైదరాబాద్ 82 స్థానంలో నిలిచింది. క్యాపిటల్స్ ఆఫ్ క్యాపిటల్ గా పిలువబడే లండన్ నగరం వరుసగా 11వ సారి ఫస్ట్ ప్లేస్ దక్కించుకుంది. సెకండ్ ప్లేస్ లో న్యూయార్క్, మూడో స్థానంలో ప్యారిస్, నాలుగో ప్లేస్ లో టోక్యో, ఐదో స్థానంలో మాడ్రిడ్, ఆరో ప్లేస్ లో సింగపూర్, ఏడో స్థానంలో రోమ్, ఎనిమిదో స్థానంలో బెర్లిన్ నిలిచాయి. మన దేశానికి చెందిన నాలుగు నగరాలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. అందులో బెంగళూరు 29వ ర్యాంకు సాధించింది. టెక్ ఎకోసిస్టం, విస్తరించిన కార్పొరేట్ బేస్ వల్ల బెంగళూరు నగరం ప్రపంచ గుర్తింపును సాధించింది. దేశ ఆర్థిక రాజధాని ముంబై 40వ స్థానంలో నిలిచింది. ఉద్యోగాలు, సాంస్కృతిక కార్యకలాపాలు, ఇన్నోవేషన్ కేంద్రంగా ముంబై ప్రాధాన్యం పెరుగుతోందని రిపోర్ట్ పేర్కొంది. రాజకీయ ప్రభావం, రవాణా కనెక్టివిటీ, అభివృద్ధి చెందుతున్న ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా దిల్లీ 54వ ర్యాంక్ లో నిలిచిందని నివేదిక వెల్లడించింది. పెరుగుతున్న టెక్నాలజీ విస్తరణ, ఐటీ సేవల కేంద్రంగా ఎదుగుతున్న కారణంగా మన హైదరాబాద్ 82వ ప్లేస్ లో నిలిచిందని నివేదిక తెలిపింది.

### 34 కేటగిరీల్లో పరిశీలన

వరల్డ్స్ బెస్ట్ సిటీస్ రిపోర్టు సిద్ధం చేయడానికి రెసోనెన్స్ కన్సల్టెన్సీ-ఇప్సోస్ సంస్థ ప్రధానంగా 34 కేటగిరీలను పరిశీలించింది. లివెబులిటీ, లవ్ ఎబులిటీ, ప్రాస్పరిటీని ప్రధానంగా తీసుకొని విశ్లేషించారు. ఈ అంతర్జాతీయ జాబితాలో ఇలా మొత్తం 276 నగరాల గుర్తించగా భారత్ నాలుగు ప్రధాన నగరాలు బలమైన స్థానాలు దక్కించుకోవడం గమనార్హం. పెరుగుతున్న టూరిజం, అధునాతన సౌకర్యాలు, ఉన్నత జీవన ప్రమాణాలతో టోక్యో 4వ స్థానం, సింగపూర్ 6వ స్థానంలో నిలిచాయి.

### విస్తరణ తర్వాత దేశంలోనే పెద్దసిటీ

ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల జాబితాలో స్థానం సంపాదించుకున్న హైదరాబాద్ రూపు రేఖలు మారనున్నాయి. నిన్న కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో దేశంలోనే అతి పెద్ద మహానగరంగా భాగ్యనగరం మారబోతున్నది. హైదరాబాద్ శివారులో ఉన్న 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం జీహెచ్ఎంసీ, తెలంగాణ మునిసిపాలిటీ చట్టాలను సవరించడానికి మంత్రివర్గం ఆమోదించింది. ప్రస్తుతం 150 మునిసిపల్ డివిజన్లతో ఉన్న జీహెచ్ఎంసీ పరిధి కొత్తవాటి విలీనంతో మూడింతలు పెరగనుంది. నగర పరిధి దాదాపు 2,735 చదరపు కిలోమీటర్లు ఉండనుంది. జనాభా దాదాపు రెండు కోట్లు ఉంటుంది.

# లొంగిపోయిన 41 మంది కీలక మావోయిస్టు నేతలు



తెలంగాణ బ్యూరో, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భద్రతా బలాలకు పెద్ద విజయంగా బుధవారం 41 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వీరిలో 32 మందిపై భారీగా రివార్డులు ఉండటం గమనార్హం. ఈ 32 మందిపై మొత్తం ₹1.19 కోట్లు రివార్డు ఉంది. లొంగిపోయిన వారిలో టాప్, మిడ్ లెవల్ నక్సలైట్లు కూడా ఉన్నారు. వీరిలో రూ. 8 లక్షల చొప్పున రివార్డు ఉన్న 9 మంది.. పండరూ హప్కా (మోహన్), అతని భార్య బండి హప్కా, లక్కూ కోర్సా, బద్రూ పునేం, సుఖరాం హేమ్లా, అతని భార్య మంజుల హేమ్లా (శాంతి), మంగ్లీ మాడ్వీ (శాంతి), జయరాం కడియం, పాండో మడకం (చాందనీ). మాటా కడియం (మంగళ), జమ్లీ కడియం, జోగీ మడకం (మాలతి)లపై రూ.5 లక్షల రివార్డ్ ఉంది. కాగా 12 మందిపై రూ. 2 లక్షలు, 8 మందిపై రూ. 1 లక్ష రిమాండ్ ఉంది. లొంగిపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రూ. 50,000 ప్రోత్సాహకంగా వెంటనే అందజేస్తోంది. అదనంగా, రీహాబిలిటేషన్ పథకాల ద్వారా సామాన్య జీవితంలోకి తిరిగి చేరుకునే అవకాశాలు కల్పిస్తారు. వీరు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, తెలంగాణ స్టేట్ కమిటీ, ధమతరి-గర్యాబంద్-నువాపడ ప్రాంతాలకు చెందిన నక్సల్ సంస్థల్లో పనిచేశారు. లొంగిపోయిన వారంతా.. భారత రాజ్యాంగంపై నమ్మకంతో, శాంతియుతమైన జీవనం గడపాలని ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.

ఈ సంవత్సరం బీజాపూర్ జిల్లాలో:
528 మంది మావోయిస్టులు అరెస్టయ్యారు
560 మంది ప్రధాన ప్రవాహంలోకి చేరారు
144 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మరణించారు

# వివాహ మహోత్సవానికి హాజరై ఆశీర్వదించిన బడే నాగజ్యోతి



వెంకటాపూర్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా వెంకటాపూర్ మండల వాస్తవ్యులు మాజీ ఎంపీటీసీ పోశాల వీరమల్లు అనితల పుత్రిక పూజిత రాజ్ కుమార్ ల వివాహ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి, మాజీ రెడ్కో చైర్మన్ వై. సతీష్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, ములుగు మండల అధ్యక్షుడు సాని కొమ్ము రమేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కోనేరు నగేష్, తుమ్మ మల్లారెడ్డి, వేల్పూరి సత్యం, సాని కొమ్ము ఆదిరెడ్డి, ముడతనపల్లి మోహన్, మోరే రాజయ్య, భాష బోయిన జ్ఞానేందర్, పోశాల చిరంజీవి, దిలీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# స్టాప్ వైలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్ పోస్టర్ ఆవిష్కరణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని స్టాప్ వైలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 16 రోజుల అవగాహన కార్యక్రమం నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు విజయవంతంగా నిర్వహించాల్సిందిగా కలెక్టర్ సూచించారు. స్త్రీలపై హింసను అరికట్టడంలో సామూహిక బాధ్యత అవసరమని, ప్రతి గ్రామంలో, ప్రతి సంస్థలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ సంకీర్త్, అదనపు కలెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి శ్రీమతి మల్లీశ్వరి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ క్రిష్ణ, మహిళా సాధికారత సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు



మహబూబాబాద్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): రెండు రోజులుగా కొనసాగుతున్న మొహబ్బత్ జిల్లా బాలల వైజ్ఞానిక ప్రదర్శన నేడు తెలంగాణ మోడల్ స్కూల్ మహబూబాబాద్ లో ముగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి మాట్లాడుతూ రెండు రోజులుగా ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొనడం జరిగిందని పిల్లలు ప్రదర్శించినటువంటి ప్రదర్శనలు చూడముచ్చటగా వాళ్లలో సృజనాత్మకతను పెంపొందించేటువంటి విధంగా ఉన్నాయని ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కూడా కొనసాగించి విద్యార్థులందరూ కూడా గొప్ప సైంటిస్టులుగా ఎదగాలనిఅన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా సైన్స్ అధికారి అప్పారావు మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఏర్పాటు చేసినటువంటి వైజ్ఞానిక ప్రతిష్టలు దాదాపుగా 5000 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ యొక్క ప్రదర్శనలు తొగత రెండు రోజులుగా ఏర్పాటు చేసినటువంటి వైజ్ఞానిక ప్రతిష్టలు దాదాపుగా 5000 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ యొక్క ప్రదర్శనలు తి లగించడం జరిగిందని. ఇందులో భాగంగా ఇన్స్పైర్ మరియు %=ాదీవూ% లో భాగంగా జూనియర్స్ మరియు సీనియర్స్ విభాగాలలో బహుమతులు అందజేయడం జరుగుతుందని మొదటి స్థానాల్లో వచ్చినటువంటి విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీజీ శ్రీరాములు ఫుడ్ కన్వీనర్ ఎంఈఓ రామదాసు మరియు న్యాయ నిర్ణేతలు, కేసముద్రం, బయ్యారం మండలాల ఎంఈవోలు యాదగిరి, దేవేంద్ర చారీ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు సర్వం సన్నద్ధం

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు యంత్రాంగం సర్వం సన్నద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో 27వ తేదీ నుండి ప్రారంభం కానున్న మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, రెండు, మూడు దశల్లో ఎన్నికలు నిర్వహణ, శాంతిభద్రతలు తదితర అంశాలపై ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 12 మండలాల్లో మూడు దశలుగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 12 మండలాల పరిధిలో 248 గ్రామపంచాయతీలో 2012 వార్డులు ఉన్నాయని ఆయన తెలిపారు. మూడు దశల్లో నామినేషన్ ప్రక్రియ స్వీకరణకు 77 క్లస్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి దశలో గణపురం, కొత్తపల్లిగోరి, రేగొండ, మొగుళ్లపల్లి మండలాల్లోని 82 గ్రామ పంచాయతీల పరిధిలోని 712 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2వ దశలో చిట్యాల, టేకుమట్ల, భూపాలపల్లి, పలిమెల మండలాల పరిధిలోని 85 గ్రామ పంచాయతీలలోని 694 గ్రామ పంచాయతీలకు, 3వ దశలో మల్హర్ రావు, మహదేవపూర్, మహా ముత్తారాం, కాటారం మండలాలలోని 81 గ్రామ పంచాయతీలలోని 696 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి విడత డిసెంబర్ 11 వతేదీ, 2వ విడత 14వ తేదీన, 3వ విడత 17 వతేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 302147 మంది ఓటర్లున్నారని, వారిలో పురుషులు 147388 మంది, మహిళలు 154744 మంది, ఇతరులు 15 మంది ఉన్నట్లు తెలిపారు. ఎన్నికలు నిర్వహణకు 77 క్లస్టర్లుగా విభజించామని, 2523 మంది పిఓలు, 3059 మంది ఓపిఓలు, 92 మంది స్టేజి 1 రిటర్నింగ్ అధికారులు, 278 మంది స్టేజి 2 రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు 93 మంది, జోనల్ ఆఫీసర్స్ 42 మంది, ఎఫ్ఎస్టీ 40 విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మొదటి విడతలో 27వ తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, నామినేషన్లు స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. 2102 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా 20 శాతం రిజర్వడ్ తో 2523 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. నామినేషన్ల ప్రక్రియ ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని మొదటి విడతలో ఈ నెల 27 నుంచి 29 తేదీ వరకు మూడు రోజులు పాటు నామినేషన్లు స్వీకరణ జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేసేందుకు ఎఫ్ ఎస్టీ, ఎస్ఎస్టి, ఎంసిసి టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రచారాలకు సంబంధించినటువంటి అన్నిటిని తొలగించి 24, 48, 72 గంటల నివేదిక రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎంపీడీవోలు ధ్రువీకరణతో నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ప్రజలు పిర్యాదు చేసేందుకు వీలుగా కలెక్టరేట్ నందు 24 గంటలు పనిచేసేలా 9030632608 సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ మాట్లాడుతూ ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డివిజన్ కు ఒకటి అలాగే 12 మండలాలలో బందోబస్తు పర్యవేక్షణకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 70 రూట్లుగా విభజించి పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య పోలింగ్ మెటీరియల్ తరలింపు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు సెన్సిటివ్, క్రిటికల్, నార్మల్ పోలింగ్ కేంద్రాలుగా విభజించి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 312 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అలాగే 30 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించి అదనపు పోలీస్ బలగాలతో పటిష్ట పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమాలు అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళి పాటించాలని ఆయన తెలిపారు. ఏదేని ఉల్లంఘన జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజలు జిల్లా యంత్రాంగం సలహాలు, సూచనలు పాటించాలని, ప్రచారాలకు అవసరమైన అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఏదైనా ఉల్లంఘన జరిగితే 24 గంటలు పని చేసేలా ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూము 8712658178 నెంబర్ కు కాల్ చేయాలని అన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు గురికాకుండా నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, డిపిఆర్ఓ శ్రీనివాస్, అడిషనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు సహకరించాలి

## రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కోరారు. బుదవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పక పాటిస్తూ గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగించడం జరుగుతుందని అన్నారు. నవంబర్ 27 నుంచి నవంబర్ 29 వరకు ప్రతిరోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని, స్వీకరించిన నామినేషన్ లను పరిశీలన చేసి నవంబర్ 30న సాయంత్రం 5 గంటల వరకు చెల్లుబాటైన నామినేటెడ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించడం జరుగుతుందని, అభ్యర్థుల జాబితా పై అప్పిళ్ళ కోసం డిసెంబర్ 01, సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందని, డిసెంబర్ 2 నాడు ఆపిళ్ళ పరిష్కరించాలని, నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 03 మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంటుందని, అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రచురణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని పార్టీల నాయకులు, ప్రజా పతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డీపీఓ శ్రీధర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్స్‌పై అవగాహన సదస్సు



మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్ రఘుపతి అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం5వ తరగతి నుండి 8 వ తరగతి SC విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుతున్న ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ 5వ తరగతి నుండి 8వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న %ాజ% బాలురకు సంవత్సరానికి 1000/- బాలికలకు 1500 /- మరియు 9 వ తరగతి మరియు 10 వ తరగతి ప్రభుత్వ మరియు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు డేస్కాలర్లకు 3500 /- హాస్టలల్స్ కు 7000 /- రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని.

ఈ స్కీమ్ కి సంబంధించిన అర్హతలు 1. ఆదాయం ధృవీకరణ పత్రం 5 నుండి 8 తరగతుల వారికి 2,00,000/- మరియు 9 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 2,50,000 /- ఆదాయం లోపు ఉండవలెనని 2. ఆధార్ కార్డు 3. కుల ధ్రువీకరణ పత్రం 4. బ్యాంక్ అకౌంట్. ఈ ధ్రువపత్రములతో విద్యార్థులు చదువుతున్న స్కూలుకు కేటాయించిన లాగిన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిం దిగా ప్రత్యేక అధికారి తెలిపారు. ఇతర వివరములకు http:telangana pass.cgg.gov.in సందర్శించవలెనని అన్నారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి. వెంకటేశ్వర్లు, ప్రదానోపాద్యాయులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

**రెండు సమస్యాత్మక మండలాల గుర్తింపు**
**ప్రతి అభ్యర్థి ఖర్చుల**
**వివరాలు నమోదు చేయాలి**
**మూడు దశలలో ఎన్నికల నిర్వహణ**
**నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ**
**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, మూడు దశలలో ఎన్నికల నిర్వహణ జరుగుతుందని, 27వ తేదీ గురువారం నుంచి నామినేషన్ లను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వీడియో సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్ లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు మూడు దశలలో నిర్వహించడం జరుగుతుందని మొదటి విడతలో ఎస్.ఎస్. తాడ్వాయి, ఏటూర్ నాగారం, గోవిందరావుపేట మూడు మండలాలలోని 48 గ్రామపంచాయతీలకు 420 వార్డు లకు తేదీ 27.11.2025 గురువారం నుండి నామినేషన్ ల స్వీకరణ ప్రారంభం అవుతుందని, తేదీ.11.12.2025 గురువారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. రెండవ దశ పోలింగ్ మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్ మూడు మండలాలలోని 52 గ్రామపంచాయతీలకు, 462 వార్డ్ లకు తేదీ.30.11.2025 ఆదివారం నామినేషన్ ల స్వీకరణ ప్రారంభం అవుతుందని, తేదీ.14.12.2025 ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. మూడవ దశలో వెంకటాపురం, వాజేడు, కన్నాయి గూడెం మూడు మండలాలలోని 46 గ్రామపంచాయతీలకు, 408 వార్డ్ లకు తేదీ.03.12.2025 బుధవారం రోజున నామినేషన్ ల స్వీకరణ ప్రారంభం అవుతుందని తేదీ.17.12.2025 బుధవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ప్రతి మండలంలో ఐదు క్లస్టర్ లను ఏర్పాటు చేశామని నామినేషన్ దాఖలాలు చేసే అభ్యర్థులు వారి క్లస్టర్ లో సూచించిన గ్రామపంచాయతీలలో నామినేషన్ సమర్పించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో వాజేడు, వెంకటాపురం రెండు సమస్యాత్మక మండలాలుగా గుర్తించడం జరిగిందని, ఓటింగ్ ప్రక్రియ వెబ్ కాస్టింగ్ చేయడం జరుగుతుందని సిగ్నల్ లేని ప్రాంతాలలో ఓటింగ్ వీడియోగ్రఫీ ద్వారా రికార్డ్ చేయడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను పరిశీలించడానికి వ్యయ పరిశీలకులను కూడా సిద్ధం చేశామని, సర్పంచ్ గా పోటీ చేసే అభ్యర్థులు 5 వేల జనాభాకు పైగా ఉన్న గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థి 2 లక్షల 50 వేల రూపాయల వరకు వార్డ్ సభ్యులకు 50 వేల రూపాయలు, 5 వేల జనాభా తక్కువగా ఉన్న గ్రామాలలో ఒక లక్ష 50 వేల రూపాయలు వార్డ్ సభ్యులు 30 వేల వరకు ఖర్చు చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ ఎస్టీ లకు, ఎస్ సి పి సి సర్వే 2024 డాటా ప్రకారం బీసీలకు ఇతరులకు డెడికేషన్ కమిటీ 46 జీవో నెంబర్ ను అనుసరించి రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని అన్నారు. ఎన్నికల అభ్యర్థులకు ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా కేంద్రంలో, స్థానిక ఎంపీడీవో కార్యాలయాలలో హెల్ప్ లైన్ డెస్క్ లను ఏర్పాటు చేశామని వీటి ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎం.డి. రఫిక్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# 2030 కామన్వెల్త్ క్రీడల వేదికగా అహ్మదాబాద్




న్యూ ఢిల్లీ, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను అహ్మదాబాద్‌కు అధికారికంగా ప్రదానం చేశారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని గ్లాస్గోలో జరిగిన జనరల్ అసెంబ్లీలో 74 కామన్వెల్త్ దేశాల ప్రతినిధులు ఈ నిర్ణయాన్ని ఆమోదించారు. 2010లో న్యూఢిల్లీ ఈ క్రీడకు ఆతిథ్యం ఇచ్చినందున ఈ కార్యక్రమాన్ని రెండవసారి నిర్వహించడానికి ఇది మార్గం సుగమం చేసింది. 2036లో ఒలింపిక్ ఆతిథ్యం ఇవ్వాలనే దేశం ఆశయాన్ని కూడా ఈ నిర్ణయం బలపరిచింది.

2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను అహ్మదాబాద్‌కు ఇవ్వాలని కామన్వెల్త్ క్రీడా సంఘం తీసుకున్న నిర్ణయం దేశానికి ప్రతిష్టాత్మకమైన క్షణమని క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. 2047 నాటికి క్రీడా శక్తి కేంద్రంగా మారడానికి ఇది కృషి చేస్తోంది. కామన్వెల్త్ క్రీడా అధ్యక్షుడు డాక్టర్ డొనాల్డ్ రుకరే మాట్లాడుతూ భారతదేశం స్థాయి, యువత, ఆశయం, గొప్ప సంస్కృతి, అపారమైన క్రీడా అభిరుచి మరియు ఔచిత్యాన్ని తీసుకువస్తుందని అన్నారు. ఒలింపిక్ ఆతిథ్య హక్కుల కోసం పోటీ పడుతున్న అహ్మదాబాద్ నగరం గత దశాబ్దంలో తన క్రీడా మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన అప్‌గ్రేడ్ చేసింది. అహ్మదాబాద్ దార్శనికత 2026 గ్లాస్గో ఊపు మీద ఆధారపడి ఉంటుంది మరియు భారతదేశ సాంస్కృతిక మరియు క్రీడా బలాలను హైలైట్ చేస్తుంది. 2030 ఎడిషన్‌లో 15 నుండి 17 క్రీడలు ఉంటాయని, పూర్తి కార్యక్రమం వచ్చే ఏడాది ఖరారు చేయబడుతుందని కామన్వెల్త్ స్పోర్ట్ తెలిపింది.

శతాబ్దపు కామన్వెల్త్ క్రీడా సంప్రదాయాన్ని జరుపుకుంటూ అథ్లెట్లు మరియు సంఘాలను ఏకం చేయడం ఈ క్రీడల లక్ష్యం.

# ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి




సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఇంటర్ బోర్డు పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, ప్రతీ సంవత్సరం పరీక్ష ఫీజు చెల్లింపు సమయంలో విద్యార్థుల వ్యక్తిగత వివరాలు, విద్యా సంబంధిత వివరాలు తప్పుగా నమోదు కావడం ఒక పెద్ద సమస్యగా మారుతోంది. పేరు, తండ్రి పేరు, గ్రూపు, మాధ్యమం, భాషా సబ్జెక్టులు వంటి కీలక అంశాల్లో తేడాలు రావడం వల్ల పరీక్ష సమయాన విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటారు. గతంలో పరీక్ష కేంద్రాల్లోనే విద్యార్థులు ఓఎంఆర్ పత్రాల్లో తప్పులు సవరించుకునే అవకాశం ఉండేది. చాలా సందర్భాల్లో తెలుగు స్థానంలో హిందీ ముద్రించబడడం, గ్రూప్ మారడం, తల్లిదండ్రుల పేర్లు తప్పుగా రావడం వంటి సమస్యల్ని అప్పటికప్పుడు సరిచేసుకునే అవకాశం ఉండేది. అయితే ఈసారి పరీక్ష కేంద్రాల్లో అలాంటి అవకాశం ఉండదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. దీనికి బదులుగా, ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్షలకు ముందుగానే వివరాల సవరణకు అవకాశం కల్పించనుంది. ఇందుకోసం డీఐఈవోలకు మరియు కాలేజీ ప్రిన్సిపాళ్లకు బోర్డు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థికి కాలేజీ ప్రిన్సిపాళ్లు నామినల్ రోల్స్‌ను చూపించి, అందులో ఉన్న అన్ని వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా కాలేజీలకు పిలిపించి వివరాలను క్రాస్ చెక్ చేయించి సంతకాలు తీసుకోవాలని సూచించింది. ఈ ప్రక్రియ ద్వారా ఓఎంఆర్ పత్రాల్లో వచ్చే పొరపాట్లను ముందుగానే పూర్తిగా నివారించవచ్చని బోర్డు భావిస్తోంది. అంతేకాక, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్ కాలేజీల్లో చదువుతున్న దాదాపు 10 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులకు పరీక్షల ఫీజులు, గడువులు, నామినల్ రోల్స్ పరిశీలన, ప్రాక్టికల్స్ షెడ్యూల్ వంటి సమాచారాన్ని ఎస్ఎంఎస్‌ల రూపంలో పంపించాలనే నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పరీక్షల ఫీజు చెల్లించిన విద్యార్థులకు నవంబర్ 30 వరకు తమ నామినల్ రోల్స్‌లో ఉన్న పొరపాట్లను సవరించుకునే అవకాశం కల్పించింది. ఫీజు గడువు ముగిసిన తరువాత కూడా మరోసారి సవరణ అవకాశం ఇవ్వనున్నట్లు బోర్డు తెలిపింది. ప్రస్తుతం 92% మంది విద్యార్థులు ఇప్పటికే పరీక్ష ఫీజులు చెల్లించడంతో, వివరాల ధృవీకరణ ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ విధంగా, ఇంటర్ బోర్డు విద్యార్థుల వివరాలను ఖచ్చితంగా సరిచేసుకునే అవకాశం అందించి, పరీక్షల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను ముందుగానే నివారించడానికి చర్యలు చేపట్టింది.

# నాలుగో బెటాలియన్లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



మామునూరు, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): మామునూరు నాలుగో బెటాలియన్ ఆవరణలో భారత రాజ్యాంగ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని అధికారులు మరియు సిబ్బందితో రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ అసెంబ్లీ రాజ్యాంగాన్ని స్వీకరించారు. 1950 జనవరి 26 నుంచి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది అని రాజ్యాంగంలోని పీఠిక, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక బాధ్యతలు ప్రజలకు కవచాలైతే మిగిలిన విభాగాలు రాజ్యాంగాన్ని తీర్చిదిద్దడానికి అవసరమైన మార్గాలని, వీటిని ప్రతి ఒక్కరు పాటించాలని, ముఖ్యంగా పోలీసులకు భారత రాజ్యాంగం గురించి పూర్తిగా తెలిసి ఉండాలని తెలిపారు. 2015లో భారత రాజ్యాంగ పితా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 2017 నవంబర్ 19న కేంద్ర ప్రభుత్వం నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. కావున ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్నాం. దీన్నే సంవిధాన్ దివాస్ అని కూడా అంటారు. ఇదే రోజు జాతీయ చట్ట దినోత్సవం కూడా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు విజయ్,కార్తీక్,రవి, వెంకటేశ్వర్లు, సర్వర్, రాజ్ కుమార్, కృష్ణ మరియు రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలు సాధించాలి

**ఏభిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్**




హనుమకొండ కేయు, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం మన దేశందే కావడం మనందరికీ గర్వకారణం అని అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ ఏభిఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో ఏబిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలోని అంశాలను గౌరవించాలన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం రాయడం వల్లే ఎస్సి ఎస్టీ బీసీ మైనారిటీ ప్రజలకు న్యాయం జరుగుతుందనీ అందరికి సమానం అవకాశాలు దక్కుతున్నాయని అన్నారు అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ సాదించాలనీ మంద నరేష్ అన్నారు. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ఉపయోగించి బహుజన రాజ్యాన్ని సాదించాలనీ నరేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏభిఎస్ఎఫ్ నాయకులు చరణ్ రాజేష్ మధు లక్ష్మణ్ సాయి కిరణ్ సాగర్ నవ్య సోని ప్రసన్న సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పరిస్థితిపై కేఏ పాల్ ఆందోళన



మొదటి పేజీ తరువాయి

ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని అన్నారు. ఇప్పుడు ఇవేస్ట్మెంట్ సమ్మిట్ అని చెప్పి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయని అన్నారు కేఏ పాల్. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ధీటుగా ఉన్నది ప్రజాశాంతి పార్టీ మాత్రమేనని అన్నారు కేఏ పాల్. జూబ్లీహిల్స్ లో ఓట్లు చీలవద్దని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం అన్న కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి అభ్యర్థన మేరకే ప్రజా శాంతి పార్టీ పోటీ చెయ్యలేదని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీ లను ఒక్కటి కూడా నెరవేర్చలేదని కాంగ్రెస్ ప్రజలకు చెప్పిన ఒక్క హామీ కూడా తీర్చలేదని మండిపడ్డారు కేఏ పాల్. మూడు రోజుల్లో తన భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తానని అన్నారు. భట్టిని ముఖ్యమంత్రి చెయ్యడానికి రెడ్డి నేతలు అందరు కలిస్తే రేవంత్ కు నేను మద్దత్తు ఇచ్చానని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం అనుకుంటే భూములు అన్నీ అమ్మి పడేస్తున్నారని రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, బీసీ నాయకులు అందరినీ ఏకతాటి పైకి తీసుకొని వస్తానని అన్నారు కేఏ పాల్. బీజేపీకి డిపాజిట్ రాని అభ్యర్థిని జూబ్లీహిల్స్ లో ఎందుకు పోటీలో నిలిపారని అన్నారు. కాంగ్రెస్ బీహార్ లో ఓటు చోరీ అంటున్నారు. మరి జూబ్లీహిల్స్ లో ఓటు చోరీ జరగలేదా అని ప్రశ్నించారు. మహారాష్ట్ర లో ఏక్ నాథ్ షిండే మాదిరిగా తెలంగాణలో పరిస్థితి తయారయ్యిందని చాలా మీడియా సంస్థలు అమ్ముడు పోతున్నాయని అన్నారు. తెలంగాణ లో ఉన్న అందరు సర్పంచ్ అభ్యర్థులకు ప్రజా శాంతి పార్టీ ఆహ్వానం పలుకుతుందని అన్నారు కేఏ పాల్. ఎన్నికల ముందు అన్నిసార్లు కాల్ చేసిన మల్లు రవి ఎన్నికల తరువాత మొఖం చాటేశారని అన్నారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం

## హామీల అమలుకు కృషి చేస్తా

## రాష్ట్ర శాసనసభ స్పీకర్ చే ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ బుధవారం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ నవీన్ కుమార్ యాదవ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం పనిచేస్తానని ఎలక్షన్ల సందర్భంగా తానిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం రోజు ప్రమాణస్వీకారం చేయడం తన అదృష్టమని తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన ఎంఐఎం పార్టీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మిలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఐబొమ్మ కేసులో కీలక పరిణామం




హైదరాబాద్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): గత కొన్ని రోజులు హాట్ టాపిక్ గా మారిని ఐబొమ్మ రవి వ్యవహారం కీలక పరిణామం చోటు చేసుకుంది. ఐ బొమ్మ వెబ్‌సైట్ వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా ఉన్న రవిపై కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ క్రైమ్ పోలీసులు మరో కీలక చర్య చేపట్టారు. ప్రస్తుతం చంచల్ గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న రవిని మరో కేసుతో సంబంధించి పీటీ వారెంట్ పై అరెస్టు చేసి, నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు పోలీసులు. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన కొత్త కేసు విచారణలో భాగంగా పోలీసులు రవిని పీటీ వారెంట్ ద్వారా కస్టడీకి తీసుకొని మొదట 9వ మెజిస్ట్రేట్ ముందు, అనంతరం 8వ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు రవికి 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో రవిని మళ్లీ చంచల్ గూ జైలుకు తరలించారు. ఐ బొమ్మ రవిపై ఇప్పటివరకు ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులన్నింటి దర్యాప్తులో భాగంగా పోలీసులు రెండవసారి 7 రోజుల కస్టడీ కోరుతూ నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రేపు ఈ కస్టడీ పిటిషన్‌పై కోర్టు తీర్పు ఇవ్వనుంది.

# అత్తింటి వేధింపులకు అల్లుడు బలి..!

**హైదరాబాద్, నవంబర్ 25:** భార్య కాపురానికి రాకపోవడంతో పాటు అత్తింటి నుంచి వేధింపులు ఎదురవడంతో.. ఆత్మ హత్యాయత్నానికి ప్రయత్నించిన అల్లుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది..బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ జగద్గిరిగుట్టకు చెందిన హరిప్రసాద్ (32)కు జగిత్యాల జిల్లా మెట్పల్లికి చెందిన పూజతో సుమారు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కూతురు ఉంది. అయితే వివాహం అయినప్పటినుంచి వేరు కాపురం పెట్టాలని భార్య, అత్తమామలు హరి ప్రసాద్‌పై ఒత్తిడి తెచ్చారు. కాగా ఈ విషయంలో దంపతులిద్దరి మధ్య గొడవలు కావడంతో, తరచూ కూతురును తీసుకొని పూజ తన పుట్టింటికి వెళ్లిపోయేది. ఈ క్రమంలోనే ఈ నెల 2న పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా.. అక్కడ అందరి ముందు తన కుమారుడిని దుర్భాషలాడి, విషం తాగి ఆత్మహత్య చేసుకోవాలని తన కుమారుడ్ని రెచ్చగొట్టారని హరిప్రసాద్ తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. పంచాయితీ అనంతరం పూజ కుమార్తెను తీసుకుని వెల్దుర్తిలో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఈ క్ర మంలో హరిప్రసాద్ ఈ నెల 18న వెల్దుర్తిలోని అత్తారింటిముందు పురుగులమందు తాగాడు. చుట్టుపక్కల వారి సాయంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తన కుమారుడి మృతికి అతని భార్య పూజ, అత్తమామలు వరలక్ష్మి, కిషన్లతో పాటు బంధువులు రామాంజనేయులు, కిరణ్, శ్రీవాణిలు కారణమంటూ మృతుడి తండ్రి మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నకిలీ ఐఏఎస్ అవతారం

## ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు

**హైదరాబాద్,నవంబర్ 26:** ఐఏఎస్‌గా అవతారమెత్తి ప్రజలను మోసగిస్తున్న వ్యకిని ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీగార్డ్సులోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పశ్చిమ మండలం డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. చంపాపేటకు చెందిన బత్తిని శశికాంత్ ఏనిమేషన్ కోర్సు చేసి చిన్న కంపెనీ ఏర్పాటు చేశాడు. ఇతని స్వస్థలం ఏపీలోని ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు. ఇటీవల షేక్‌పేటలోని అపర్ణ ఔరా అపార్టుమెంట్‌కు మకాం మార్చాడు. నేర్చుకున్న ఏనిమేషన్ కోర్సును ఉపయోగించి తన పేరిట నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు తయారు చేశాడు. పోలీసు, ఎన్ఐఏలో ప్రత్యేక ఆపరేషన్ల కోసం తనను ప్రభుత్వం నియమించిందని నమ్మబలుకుతూ తిరుగుతుండేవాడు. తమిళనాడుకు చెందిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను గన్‌మెన్లుగా నియమించుకున్నాడు. గన్‌మెన్లతో కలిసి షేక్‌పేటలోని గోల్డ్ జిమ్‌కు వెళ్లేవాడు. కసరత్తు చేస్తున్న సమయంలో ఫోన్ రింగ్‌కాగా ప్రత్యేక ఆపరేషన్‌కు వెళుతున్నానంటూ హడావిడిగా జిమ్ నుంచి బయటికి వెళ్లేవాడు. ఈనేపథ్యంలో టీఎస్ఐఐసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, ఖాళీ స్థలాలు కేటాయించే విభాగానికి ప్రత్యేక ఐఏఎస్ అధికారినంటూ జిమ్ ఎండీ అలీ హసన్‌కు చెప్పాడు. పరిశ్రమ స్థాపన కోసం స్థలం కేటాయింపు జరిగిదంటూ నకిలీ అలాట్‌మెంట్ ఆర్డర్ తయారు చేసి అలీ హసన్‌కు చూపించి, రూ.10.50 లక్షల నగదు బ్యాంకు నుంచి బదిలీ చేయించుకున్నాడు.

# ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్




హైదరాబాద్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు హైదరాబాద్ హబ్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం శంషాబాద్ సమీపంలోని జీఎంఆర్ ఏరో పార్క్ లో సాఫ్రాన్ ఏర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఫెసిలిటీని ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, సాఫ్రాన్ ఛైర్మన్ రాస్ మెక్‌ఇన్నెస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణపై నమ్మకంతో హైదరాబాద్‌ను ఎంచుకున్న సాఫ్రాన్ సంస్థకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కొత్త సదుపాయం ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ వృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు.

**భారత వైమానిక, నావికాదళానికి మేలు**

భారతదేశంలో లీప్ ఇంజిన్ల మొట్టమొదటి మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ సెంటర్ ఇదే కావడం విశేషమని తెలిపారు. రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సదుపాయంతో వెయ్యి మందికి పైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. సాఫ్రాన్ సంస్థకు చెందిన %వీ%88 మిలిటరీ ఇంజిన్ ఎంఆర్వో కు శంకుస్థాపన చేశామని ఇది భారత వైమానిక దళం, భారత నావికాదళానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు హైదరాబాద్ హబ్‌గా మారిందని అన్నారు. తెలంగాణలో 25 కంటే ఎక్కువ ప్రధాన ప్రపంచ కంపెనీలు, 1,500కు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయన్నారు. తమ ప్రభుత్వ ప్రగతిశీల పారిశ్రామిక విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని తెలిపారు. తమ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ పార్కులు, సెజ్ లు ప్రముఖ ప్రపంచ కంపెనీల నుంచి అనేక భారీ పెట్టుబడులను ఆకర్షించాయని అన్నారు.

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రండి**

సాఫ్రాన్, బోయింగ్, ఎయిర్‌బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను తయారీ, పరిశోధన, అభివృద్ధి కోసం ఎంచుకున్నాయని పేర్కొన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో మన ఎగుమతులు గత ఏడాది రెట్టింపు అయ్యాయని 9 నెలల్లో రూ.30,742 కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి తెలంగాణ ఏరోస్పేస్ అవార్డును పొందిందని గుర్తు చేశారు. బెంగళూరు–హైదరాబాద్‌ను డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో 30 వేల ఎకరాల విస్తీర్ణంలో తాము భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని అన్నారు. తమ విజన్‌ను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే తెలంగాణ రైజింగ్ 2047 – గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వానిస్తున్నామని అన్నారు. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు తాము ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.


# న్యాయస్థానంలో "రిజర్వేషన్ల" పంచాయతీ

## హైకోర్టులో పిటిషన్లు దాఖలు

## బీసీ రిజర్వేషన్లపై అభ్యంతరాలు

## నామినేషన్ల స్వీకరణ వేళ కోర్టు నిర్ణయంపై ఉత్కంఠ

## ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, బీసీ సంఘాల ఆరోపణలు




తెలంగాణ బ్యూరో, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలకు ఎస్ఈసీ నోటిఫికేషన్ జారీ చేసిన వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించలేదంటూ పలువురు గ్రామస్థుల ఇవాళ పిటిషన్లు దాఖలు చేశారు. వెల్దండ తిమ్మనోనిపల్లి వార్డుల రిజర్వేషన్ల ఖరారుపై, వరంగల్, సంగారెడ్డి జిల్లాలోని గ్రామాల్లోనూ రిజర్వేషన్లను సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై హైకోర్టు రేపు విచారణ జరపనుంది. అయితే ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ కొనసాగనున్న వేళ హైకోర్టు నిర్ణయం ఉత్కంఠ రేపుతోంది. బీసీల రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని ఇటు బీసీ సంఘాలు అటు ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న వేళ హైకోర్టులో ఈ పిటిషన్లు దాఖలు కావడం హాట్ టాపిక్గా మారింది.

# రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా జరుగుతున్నాయా..?

## పంచాయతీ రిజర్వేషన్లపై లెక్కల తారుమారు ఆరోపణలు

## బీసీల సంఖ్య తగ్గింపుపై కవిత తీవ్ర విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 26 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో కులగణన తప్పుగా చేశారని, బీసీల సంఖ్య తగ్గించి నమోదు చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆమె జిల్లాల వారిగా చేసిన కులగణనలో బీసీల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. మహబూబాబాద్ లో నాడు 9 శాతం ఉన్న బీసీల సంఖ్య.. కాంగ్రెస్ పాలనలో 4 శాతానికి ఎలా పడిపోయిందని ప్రశ్నించారు. 5-6 శాతం బీసీ జనాభా ప్రభుత్వం తగ్గించిందనేందుకు మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో బీసీల సంఖ్యే సాక్ష్యమన్నారు.

ఆదిలాబాద్ లో 205 గ్రామాలకు 5 నాన్ షెడ్యూల్డ్ ఏరియాలు ఉంటే..2019లో 47 గ్రామాలకు బీసీ రిజర్వేషన్లు వచ్చాయన్నారు. ఇప్పుడు గ్రామ పంచాయతీలు పెరగ్గా 23 గ్రామాలకు బీసీ రిజర్వేషన్లు వచ్చాయన్నారు. దీనిని బట్టి బీసీల సంఖ్యను గ్రామాల్లో సగానికి సగం లెక్కల్లో తక్కువగా చూపించారని స్పష్టమవుతుందన్నారు. ఆసిఫాబాద్ లో కూడా 2019లో 33 గ్రామాలకు బీసీ రిజర్వేషన్లు వస్తే.. ఇప్పుడు 20 గ్రామాలకే బీసీ రిజర్వేషన్లు వచ్చాయన్నారు. అప్పటికీ ఇప్పటికీ ఇంత తేడా ఎందుకు వస్తుందని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్ల లెక్కలు తప్పుగా ఉన్నాయన్నారు.

రాష్ట్రంలో 12,735 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. వాటిలో ఏజెన్సీ పంచాయతీలను తీసేయగా.. 10,223 గ్రామ పంచాయతీల్లో కేవలం 2,176 గ్రామ పంచాయతీలకు అంటే 21 శాతం మాత్రమే బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చారన్నారు. నిజానికి 42 శాతం రిజర్వేషన్లలో ఇది సగం మాత్రమేనన్నారు. రాష్ట్రంలో మరో 2,176 గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2011లో ఉన్న రిజర్వేషన్ల ప్రకారమే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఇచ్చినపుడు, బీసీలకు మాత్రం తాజా కులగణన ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం సరికాదన్నారు. సోషియో ఎకనామిక్స్ సర్వే బేసిస్ పైనే రిజర్వేషన్లు చేసి ఉంటే.. కొత్తగూడెంలో 25 గ్రామాల్లో సగానికి సగం బీసీలకు వచ్చేదన్నారు. మంత్రులు ఎవరికి రిజర్వేషన్ ఇవ్వాలని చెప్తే వారికే రిజర్వేషన్లు ఇస్తున్నారని కవిత దుయ్యబట్టారు. రాష్ట్రంలో రిజర్వేషన్లు ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు జరుగుతున్నాయా లేక రాజ్యాంగ బద్ధంగా జరుగుతున్నాయా? రాహుల్ గాంధీ తెలుసుకోవాలని, దీనిపై తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



# తిన్న తర్వాత కడుపు నొప్పి, ఉబ్బరం అనిపిస్తుందా?

## ఈ విషయాలు తెలుసుకోండి.!

మనలో చాలా మంది తిన్న తర్వాత కడుపు నొప్పి, ఉబ్బరం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. జీర్ణవ్యవస్థలో అధిక గ్యాస్, త్వరగా తినడం, మలబద్ధకం, కొన్ని రకాల ఆహారాలు, అతిగా కొవ్వు లేదా కారంగా ఉండే ఆహారాలు తీసుకోవడం కూడా దీనికి కారణం కావచ్చు. మీరు కూడా తిన్న తర్వాత కడుపు నొప్పి, ఉబ్బరం సమస్యతో ఇబ్బంది పడుతున్నారా? అలా అయితే, మీరు IBS సమస్యతో బాధపడుతుండవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అసలు IBS అంటే ఏంటి? ఈ సమస్యతో బాధపడేవారు ఆహారం విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**IBS అంటే ఏమిటి?**

IBS అంటే ఇరిటబుల్ బవెల్ సింద్రోమ్ (Irritable Bowel Syndrome). ఇది కడుపు, ప్రేగులను ప్రభావితం చేసే ఒక సాధారణ, దీర్ఘకాలిక జీర్ణ సమస్య. దీని ప్రధాన లక్షణాలు కడుపు నొప్పి, తిమ్మిరి, ఉబ్బరం, గ్యాస్, అతిసారం లేదా మలబద్ధకం (లేదా రెండూ). IBS ప్రాణాంతకం కానప్పటికీ, ఇది జీవన నాణ్యతను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఈ సమస్యకు మందులు, చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ, మీరు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.

IBS సమస్య ఉన్నవారు కరిగే ఫైబర్ ఎక్కువగా ఉండే ఓట్స్, పప్పులు, క్యారెట్లు, బంగాళదుంపలు వంటివి తినాలి. అలాగే, తక్కువ ఫ్రక్టోజ్ ఉన్న పండ్లు (అరటిపండ్లు, బెర్రీలు) అల్లం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. IBS లక్షణాల ప్రకారం, మలబద్ధకం తగ్గించడానికి ఫైబర్ ముఖ్యమైనది, కానీ కొందరికి కరగని ఫైబర్ (బీన్స్, బ్రోకలీ వంటివి) ఉబ్బరాన్ని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు.

IBS సమస్యలు ఉన్నవారు కొన్ని ఆహారాలను తగ్గించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అధిక ఫ్రక్టోజ్, గ్యాస్ కలిగించే కూరగాయలు (బీన్స్, బ్రోకలీ వంటివి), కొన్ని పాల ఉత్పత్తులు, కొవ్వు పదార్థాలను తీసుకోకండి. కెఫిన్, ఆల్కహాల్, కృత్రిమ తీపి పదార్థాలను కూడా నివారించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



# శీతాకాలం.. గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే.!

శీతాకాలంలో గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చలి శరీర రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది, ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని పెంచుతుంది. ఇంకా, ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల అధిక లేదా తక్కువ రక్తపోటు వస్తుంది. ఇది తల్లి, బిడ్డ ఇద్దరికీ ప్రమాదకరం. చల్లని గాలులు శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తాయి. దీని వలన అలసట, తలతిరుగుడు, బలహీనత ఏర్పడుతుంది. విటమిన్ డి లోపం, చర్మం పొడిబారడం కూడా గర్భిణీ స్త్రీలకు సమస్యగా ఉంటుంది. అందువల్ల, ఈ సీజన్‌లో అదనపు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం.

శీతాకాలం గర్భిణీ స్త్రీలను అనేక విధాలుగా ప్రభావితం చేస్తుంది . గర్భధారణ సమయంలో రోగనిరోధక శక్తి ఇప్పటికే బలహీనంగా ఉన్నందున, ఫ్లూ, జలుబు, న్యుమోనియా వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు అతిపెద్ద ప్రమాదం. చల్లని ఉష్ణోగ్రతలు రక్త ప్రసరణను ప్రభావితం చేస్తాయి. దీని వలన చేతులు, కాళ్ళు చల్లబడటం, తిమ్మిరి, రక్తపోటులో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. కొంతమంది మహిళలు కీళ్ల నొప్పులు, అలసట, శ్వాస సమస్యలను కూడా అనుభవించవచ్చు. చర్మం పొడిబారడం, పగుళ్లు సర్వసాధారణం. సూర్యరశ్మి లేకపోవడం వల్ల విటమిన్ డి స్థాయిలు తగ్గుతాయి. దీని వలన ఎముకలు బలహీనపడతాయి. శరీరం తగినంత వెచ్చగా లేకపోతే కండరాల దృఢత్వం, నొప్పి కూడా సమస్యగా ఉంటుంది. అందువల్ల, గర్భధారణ సమయంలో చల్లని వాతావరణం ప్రభావాలు తీవ్రంగా ఉంటాయి.

**గర్భిణీ స్త్రీలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

- గర్భిణీ స్త్రీలు శీతాకాలంలో క్రమం తప్పకుండా వెచ్చని దుస్తులు ధరించాలి.
- విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. చాలా చల్లగా ఉండే ఆహార పదార్థాలను తినడం మానుకోండి.
- పగటిపూట తేలికపాటి వ్యాయామం లేదా వాకింగ్ చేయాలి. ఇలా చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది.
- ఈ సీజన్‌లో దాహం వేయకపోయినా తగినంత నీరు తాగుతుండాలి.
- ఉదయం సూర్యరశ్మికి నిలబడటం చాలా ముఖ్యం.
- వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి బయటకు వెళ్ళేటప్పుడు మాస్క్ ధరించండి.
- గర్భధారణ సమయంలో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం కాబట్టి, తగినంత నిద్రపోండి. ఒత్తిడిని నివారించండి. ఏవైనా అసాధారణ లక్షణాలు ఉంటే వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి.
- వైద్యుల సలహా మేరకు ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోండి.
- ఎప్పటికప్పుడు ప్రినేటల్ చెకప్‌లు చేయించుకోండి.

## మన శరీరంలో అనేక విధులను నిర్వహించే ఈ పోషక పదార్థం గురించి మీకు తెలుసా..?

# దీన్ని ఎలా పొందాలంటే..?

మన శరీరంలో అనేక జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేందుకు, శరీరానికి శక్తి లభించేందుకు, రోగాలు రాకుండా ఉండేందుకు అనేక పోషకాలు సహాయం చేస్తాయి. కనుక అన్ని పోషకాలను మనం తరచూ అందేలా చూసుకోవాలి. అయితే పోషకాలు అంటే చాలా మంది విటమిన్ ఎ, బి12, విటమిన్ డి, సి లాంటివి చెబుతారు. అంత వరకు బాగానే ఉన్నా ఇంకా అలాంటి పోషకాలు చాలానే ఉన్నాయన్న సంగతి అనేక మందికి తెలియదు. మన శరీరానికి కేవలం విటమిన్లు మాత్రమే కాదు, అనేక మినరల్స్ కూడా అవసరం అవుతాయి. కనుక మినరల్స్ కూడా లభించేలా చూసుకోవాలి. ఇక మినరల్స్‌లో క్యాల్షియం, ఐరన్, పొటాషియం వంటివి చెబుతారు. కానీ ఇవే కాకుండా మన శరీరానికి కావల్సిన మినరల్స్ లో ఇంకా అనేకం ఉన్నాయి. వాటిల్లో సెలీనియం కూడా ఒకటి. సెలీనియం కూడా మన శరీరంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అనేక జీవక్రియలకు ఇది అవసరం అవుతుంది.




**అనేక పనులు నిర్వహిస్తుంది..**

మనకు నిత్యం అవసరం అయ్యే అనేక మినరల్స్‌లో సెలీనియం కూడా ఒకటి. దీని గురించి చాలా మందికి అవగాహన లేదు. అందువల్ల సెలీనియంను చాలా మంది తీసుకోరు. కానీ ఇది అనేక పనులను నిర్వహిస్తుంది. మన శరీరంలో అనేక జీవక్రియలకు సహాయం చేస్తుంది. మనల్ని ఆరోగ్యంగా ఉంచేందుకు తోడ్పడుతుంది. మన శరీర మెటబాలిజం పెరిగేందుకు సెలీనియం దోహదం చేస్తుంది. దీని వల్ల క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలు తగ్గుతాయి. సెలీనియం వల్ల థైరాయిడ్ పనితీరు మెరుగు పడుతుంది. థైరాయిడ్ ఉన్నవారికి సెలీనియం ఎంతో మేలు చేస్తుంది. అలాగే శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు సెలీనియం ఉండే ఆహారాలను తింటుంటే ఉపయోగం ఉంటుంది.

**యాంటీ ఆక్సిడెంట్ లాగే..**

ఇక సెలీనియం మినరల్ అయినప్పటికీ ఇది యాంటీ ఆక్సిడెంట్‌లాగే పనిచేస్తుంది. రోజూ మన శరీరానికి తగినంత సెలీనియం లభించేలా చూసుకోవాలి. దీని వల్ల అనేక లాభాలను పొందవచ్చు. సెలీనియం యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక వైరస్ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభించేలా చేస్తుంది. వైరస్ కారణంగా వచ్చే వ్యాధులు, జ్వరాలను తగ్గిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. వ్యాధులు రాకుండా చూస్తుంది. సెలీనియం తగినంతగా లభించకపోతే శరీరం తరచూ ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతుంది. కనుక మన శరీరానికి సెలీనియం లభించేలా చూసుకోవాలి. సెలీనియం మనకు రోజుకు 70 నుంచి 80 మైక్రోగ్రాముల మోతాదులో అవసరం అవుతుంది. ఇది మనకు అనేక ఆహారాల్లో లభిస్తుంది.


**సెలీనియం ఉండే ఆహారాలు..**

సెలీనియం మనకు సముద్రపు ఆహారంలో అధికంగా లభిస్తుంది. పీతలు, చేపలు, రొయ్యలు వంటి ఆహారాలను తింటుంటే సెలీనియంను పొందవచ్చు. అలాగే బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా విత్తనాలు, అవిసె గింజలు వంటి నట్స్, సీడ్స్‌లోనూ ఇది ఉంటుంది. చికెన్, కోడిగుడ్లు, పాలకూర, పుట్ట గొడుగులు వంటి ఆహారాలను తింటున్నా కూడా సెలీనియంను పొందవచ్చు. వెల్లుల్లి, ఆవాలు, ఆలివ్ ఆయిల్, బ్రోకలీ, ఓట్స్, మటన్ లివర్, పైన్ నట్స్ వంటి ఆహారాలను తినడం వల్ల కూడా సెలీనియం లభిస్తుంది. ఇలా ఆయా ఆహారాలను తరచూ తింటుంటే సెలీనియం లభించేలా చూసుకోవచ్చు. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# విటమిన్ డి ట్యాబ్లెట్లను వాడుతున్నారా..?

## అయితే ఈ విషయాలను తప్పనిసరిగా తెలుసుకోవాల్సిందే..!

విటమిన్ డి మనకు సూర్యరశ్మి ద్వారా లభిస్తుందన్న విషయం తెలిసిందే. రోజూ కాసేపు ఎండలో నిలుచుంటే ఈ విటమిన్‌ను చాలా సులభంగా పొందవచ్చు. పూర్వం ప్రజలు రోజూ ఎండలో శారీరక శ్రమ అధికంగా చేసేవారు. కనుకనే వారికి విటమిన్ డి లోపం ఉండేది కాదు. కానీ ఇప్పుడు మనుషుల శరీరానికి అసలు ఎండ తగలడం లేదు. దీంతో విటమిన్ డి లోపం ఏర్పడుతోంది. ప్రస్తుతం మన దేశంలో అధిక శాతం మంది ప్రజలు విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారు. చిన్నారుల్లో ఈ సమస్య అధికంగా ఉంటోంది. దీని వల్ల చిన్నారులకు విటమిన్ డి డ్రాప్స్‌ను ఇవ్వాల్సి వస్తోంది. అలాగే పెద్దలు కూడా చాలా మంది విటమిన్ డి ట్యాబ్లెట్లను వాడుతున్నారు. అయితే ఇంత వరకు బాగానే ఉన్నా విటమిన్ డి ట్యాబ్లెట్లను వాడుతున్న వారు పలు విషయాలను తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.




**విటమిన్ డి ఎక్కువైతే..**

విటమిన్ డి ట్యాబ్లెట్లను సొంతంగా వాడకూడదు. కచ్చితంగా డాక్టర్ సూచన మేరకు ఉపయోగించాలి. విటమిన్ డి లోపం ఉంటే మన శరీరానికి తగిన విధంగా వైద్యులు డోసు నిర్ణయిస్తారు. ఆ ట్యాబ్లెట్లను ఎన్ని రోజులు ఏ సమయంలో వేసుకోవాలో నిర్ధారిస్తారు. ఈ క్రమంలో వైద్యులు సూచించిన మేర మాత్రమే ఈ ట్యాబ్లెట్లను వాడాల్సి ఉంటుంది. కానీ కొందరు మాత్రం నిర్దేశించిన కాల పరిమితి కన్నా ఎక్కువ కాలం పాటు ఈ ట్యాబ్లెట్లను వాడుతారు. అలా ఎన్నడూ చేయకూడదు. అవసరం అయితే మళ్లీ టెస్టులు చేయించుకుని డాక్టర్‌ను కలిసి ఆ తరువాత మాత్రమే ఈ ట్యాబ్లెట్లను వాడాల్సి ఉంటుంది. విటమిన్ డి ట్యాబ్లెట్లను అధికంగా ఉపయోగిస్తే పలు దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. విటమిన్ డి కొవ్వులో కరుగుతుంది. కనుక ఇది శరీరంలో నిల్వ ఉంటుంది. అయితే విటమిన్ డి ట్యాబ్లెట్లను ఎక్కువ కాలం పాటు వాడితే శరీరంలో దీని మోతాదు పెరిగిపోతుంది. దీంతో శరీరం విష తుల్యంగా మారుతుంది. శరీరంలో విటమిన్ డి మరీ అధికంగా ఉంటే ఆ పరిస్థితిని విటమిన్ డి టాక్సిసిటీ అంటారు. ఇది మరింత ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతో పలు వ్యాధులు వస్తాయని వారు అంటున్నారు.

**తీవ్ర ప్రభావం..**

విటమిన్ డి శరీరంలో అధికంగా పేరుకుపోతే అప్పుడు అలాంటి స్థితిని హైపర్ విటమినోసిస్ డి అంటారు. అంటే మోతాదుకు మించిన విటమిన్ డి శరీరంలో ఉండడం అన్నమాట. ఈ స్థితిలో శరీరం తీవ్ర దుష్పరిణామాలను ఎదుర్కొంటుంది. శరీరంలో విటమిన్ డి మోతాదు మించితే, అది దీర్ఘకాలంగా అలాగే ఉంటే అప్పుడు వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే శరీరంలో క్యాల్షియం స్థాయిలు విపరీతంగా పెరిగిపోతాయి. దీంతో కిడ్నీ స్టోన్లు ఏర్పడుతాయి. కొందరిలో కిడ్నీలు దెబ్బ తినే ప్రమాదం ఉంటుంది. విటమిన్ డి స్థాయిలు అధికంగా ఉంటే కొందరికి బీపీ పెరుగుతుంది, అలాగే ఎముకలపై ప్రభావం పడుతుంది. ఎముకలు బలహీనంగా మారుతాయి. అలసట, నీరసం ఉంటాయి. కిడ్నీలపై ఒత్తిడి పెరిగి మూత్రం సాఫీగా జారీ అయ్యేందుకు కష్టమవుతుంది. దీంతో కిడ్నీలపై అధికంగా భారం పడుతుంది. ఇలా విటమిన్ డి మోతాదు మించితే అనేక తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.



**ఎంత మోతాదులో అవసరం..**

విటమిన్ డి మనకు సాధారణంగా రోజుకు 600 ఐయూ మోతాదులో అవసరం అవుతుంది. విటమిన్ డి మనకు విటమిన్ డి2, డి3 అనే ట్యాబ్లెట్ల రూపంలో లభిస్తుంది. ఇది మన శరీరంలో విటమిన్ డి గా మారుతుంది. విటమిన్ డి2 మనకు వృక్ష సంబంధ పదార్థాల ద్వారా లభిస్తే, డి3 జంతు సంబంధ పదార్థాల ద్వారా లభిస్తుంది. ఇవి రెండూ మన శరీరంలో విటమిన్ డిగా మారుతాయి. కనుక విటమిన్ డి పొందాలంటే వృక్ష లేదా జంతు సంబంధ పదార్థాలు వేటినైనా తీసుకోవచ్చు. నారింజ పండ్లు, అవకాడో, పుట్టగొడుగులు, చీజ్, పాలు, పెరుగు, చికెన్, మటన్, మటన్ లివర్, చేపలు, గుడ్లు వంటి ఆహారాలను తీసుకోవడం ద్వారా కూడా విటమిన్ డి లభించేలా చూసుకోవచ్చు. విటమిన్ డి లోపం ఉన్నవారికి రోజుకు 6000 ఐయూ లేదా వారానికి 50,000 ఐయూ మోతాదులో విటమిన్ డి లభించేలా ట్యాబ్లెట్లను ఇస్తారు. ఈ క్రమంలోనే ట్యాబ్లెట్లను ఎంత కాలం పాటు వాడాలో అంతే కాలం పాటు వాడాల్సి ఉంటుంది. ఎక్కువ కాలం పాటు వాడితే తీవ్ర దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

# చెత్తగా ఓడిన టీమిండియా

**సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన దక్షిణాఫ్రికా**

**రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఘన విజయం**

**140 పరుగులకే కుప్పకూలిన భారత్**

**408 పరుగుల భారీ తేడాతో గెలుపు**





భారత క్రికెట్ జట్టుకు టెస్టుల్లో మరో ఘోర ఓటమి ఎదురైంది. గతేడాది న్యూజిలాండ్ చేతిలో 0-3తో వైట్ వాష్ అయిన భారత జట్టు.. సరిగ్గా ఏడాది తర్వాత మరోసారి వైట్ వాష్ అయ్యింది. అయితే ఈసారి సౌతాఫ్రికా చేతిలో.. రెండో టెస్టులో ఘోరంగా ఓడింది. ఏకంగా 408 పరుగు తేడాతో చిత్తు చిత్తుగా ఓడింది. ఈ క్రమంలో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2-0తో దక్షిణాఫ్రికా క్లీన్ స్వీప్ చేసింది. కాగా భారత టెస్టు క్రికెట్ చరిత్రలో ఇన్ని పరుగుల తేడాతో ఓడడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. మ్యాచ్‌ను డ్రా చేసుకోవాలంటే చివరి రోజంతా క్రీజులో నిలవాల్సిన పరిస్థితిలో.. ఓవర్ నైట్ స్కోరు 27/2 తో ఐదో రోజు రెండో ఇన్నింగ్స్‌ను భారత్ కొనసాగించింది. అయితే మరో 113 పరుగులు జోడించి మిగిలిన 8 వికెట్లను కోల్పోయింది. టీమిండియా బ్యాటర్లలో రవీంద్ర జడేజా (54 87 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు) హాఫ్ సెంచరీ చేశాడు. యశస్వి జైస్వాల్ (13), సాయి సుదర్శన్ (14), వాషింగ్టన్ (16) లు మినహా మిగిలిన అందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో సైమన్ హార్మర్ ఆరు వికెట్లు తీశాడు. కేశవ్ మహరాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు. మార్కో జాన్సెన్, సేనురన్ ముత్తుసామిలు చెరో వికెట్ పడగొట్టారు. యశస్వి జైస్వాల్(13), కేఎల్ రాహుల్(6), సాయి సుదర్శన్(14), కుల్దీప్ యాదవ్(5), ధ్రువ్ జురెల్(2), రిషభ్ పంత్(13), వాషింగ్టన్ సుందర్(16), మహమ్మద్ సిరాజ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. సౌతాఫ్రికా బౌలర్లలో సిమన్ హార్మర్(6/37) ఆరు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించగా.. కేశవ్ మహరాజ్(2/37) రెండు వికెట్లు పడగొట్టాడు. మార్కో జాన్సెన్, సీనర్ ముత్తుసామి తలో వికెట్ తీసారు. రెండో ఇన్నింగ్స్‌ల్లో కలిపి భారత్.. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ స్కోర్‌ను కూడా చేయలేకపోయింది. రోడ్డులాంటి పిచ్‌పై భారత బ్యాటర్లు విఫలమవ్వడం అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోర్ చేసింది. సెనరన్ ముత్తుసామి(206 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 109) సెంచరీ సాధించగా.. మార్కో జాన్సెన్(91 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 93) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. అనంతరం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్(58), వాషింగ్టన్ సుందర్(48) మినహా మరే బ్యాటర్ రాణించలేదు. మార్కో జాన్సెన్ 6 వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ఇప్పటికే ఈ సిరీస్‌లో సౌతాఫ్రికా 1-0తో ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ డ్రా అయినా సిరీస్‌ను ఆ జట్టే కైవసం చేసుకుంటుంది.

**మ్యాచ్ సంక్షిప్త స్కోరు..**

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్-489 ఆలౌట్
భారత తొలి ఇన్నింగ్స్-201 ఆలౌట్
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్-260 5 డిక్లేర్
భారత్ రెండో ఇన్నింగ్స్-140 ఆలౌట్

# స్వదేశంలో రెండుసార్లు క్లీన్ స్వీప్!

## హెడ్ కోచ్‌గా గౌతమ్ పరిస్థితి ఏంటి?



టీమిండియా మరో టెస్టు సిరీస్‌లో ఓడిపోయింది. దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లో ఘోరంగా పరాజయం పాలైంది. ఇది ఒక్కటే కాదు భారత్ హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన పరిణామాలు చూస్తుంటే ఆయన కోచింగ్‌పై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆటగాళ్లను పంపించిన విధానంపై, జట్టు కూర్పుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో భారత క్రికెట్ జట్టు మరో టెస్ట్ సిరీస్‌ను కోల్పోయింది. దక్షిణాఫ్రికా, భారతదేశంలో ఆడిన 2 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 2-0 తేడాతో గెలుచుకుంది. ఈ ఓటమితో గంభీర్ కోచింగ్‌పై కూడా ప్రశ్నలు తలెత్తాయి, అతను ఒక టెస్ట్‌లో వాషింగ్టన్ సుందర్‌ను మూడో స్థానంలో బ్యాటింగ్ చేయడానికి పంపాడు. తదుపరి మ్యాచ్‌లో బ్యాటింగ్ ఆర్డర్ మార్చారు. ధ్రువ్ జురెల్, రిషబ్ పంత్ ఇద్దరు వికెట్ కీపర్లను ప్లేయింగ్ 11లో ఉంచే వ్యూహం కూడా ఫ్లాప్ అయ్యింది. జట్టులో టెస్ట్ స్పెషలిస్టుల స్థానంలో ఆల్ రౌండర్లకు ప్రాధాన్యతనిస్తున్నారు, అయితే వారిని కూడా సరిగా ఉపయోగించడం లేదు. నితీష్ కుమార్ రెడ్డి రెండో టెస్ట్ ఆడాడు, కానీ రెండు ఇన్నింగ్స్‌ల్లో మొత్తం 10 ఓవర్లు మాత్రమే వేశాడు. ఇక్కడ గౌతమ్ గంభీర్ రిపోర్ట్ కార్డ్‌ను పరిశీలిద్దాం. అతని కోచింగ్‌లో భారత్ ఎన్ని టెస్ట్‌లు ఆడిందో, వాటిలో ఎన్ని మ్యాచ్‌లు భారత్ గెలిచిందో, ఎన్ని ఓడిపోయిందో తెలుసుకోండి. ఇక్కడ అతని కోచింగ్‌లో టెస్ట్ సిరీస్‌ల రికార్డు కూడా ఇచ్చాం. గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో భారత క్రికెట్ జట్టు ఇప్పటివరకు మొత్తం 19 టెస్ట్‌లు ఆడింది. వీటిలో టీమ్ ఇండియా కేవలం 7 మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది. దక్షిణాఫ్రికాతో గువాహటిలో ఓడిపోవడం గంభీర్ కోచింగ్‌లో భారత్‌కు 10వ ఓటమి. గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్‌కు ఇది ఆరో టెస్ట్ సిరీస్. న్యూజిలాండ్‌తో భారత్ స్వదేశంలో 0-3తో టెస్ట్ సిరీస్‌ను కోల్పోయింది, ఆ తర్వాత దక్షిణాఫ్రికా కూడా టీమ్ ఇండియాను భారత్‌లో క్లీన్ స్వీప్ చేసింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో ఇంగ్లాండ్ పర్యటనలో భారత్ 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 2-2తో సమం చేసింది, ఆ తర్వాత వెస్టిండీస్‌ను స్వదేశంలో 2-0తో ఓడించింది. కానీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ జట్టు దక్షిణాఫ్రికా ముందు టీమ్ ఇండియా పూర్తిగా విఫలమైంది. గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో ఆడిన 6 టెస్ట్ సిరీస్‌లలో 3 టీమ్ ఇండియా కోల్పోయింది. న్యూజిలాండ్‌తో 2024లో స్వదేశంలో 0-3తో ఓడిపోయిన తర్వాత, టీమ్ ఇండియా ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (2024-2025) సిరీస్‌ను 1-3తో కోల్పోయింది. ఇప్పుడు దక్షిణాఫ్రికా టీమ్ ఇండియాను భారత్‌లో ఓడించింది. గంభీర్ కోచింగ్‌లో టీమ్ ఇండియా స్వదేశంలో టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ ఓటమి పాలుకావడం ఇది రెండోసారి.

# ఓటమి తీవ్ర నిరాశకు గురి చేసింది

## జట్టుగా మేం చాలా మెరుగవ్వాలి.. మ్యాచ్ అనంతరం రిషభ్ పంత్



జట్టుగా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోకపోవడంతోనే ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్నామని టీమిండియా తాత్కలిక టెస్ట్ కెప్టెన్ రిషభ్ పంత్ అన్నాడు. ప్రత్యర్థి తమ కంటే మెరుగైన ప్రదర్శన చేసిందని చెప్పాడు. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా సౌతాఫ్రికాతో బుధవారం ముగిసిన ఆఖరి టెస్ట్‌లో టీమిండియా 408 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ విజయంతో సౌతాఫ్రికా 2-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. 93 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో టీమిండియా వరుసగా రెండో ఏడాది సొంతగడ్డపై క్లీన్ స్వీప్ అయ్యింది. గతేడాది ఇదే సమయంలో న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను 3-0తో కోల్పోయింది. 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్ గెలిచింది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన రిషభ్ పంత్.. ఈ ఘోర పరాజయం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నాడు. సౌతాఫ్రికా తమ కంటే మెరుగ్గా ఆడిందని కొనియాడాడు. 'ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురి చేసింది. జట్టుగా మేం చాలా మెరుగవ్వాలి. మా కంటే బాగా ఆడిన సౌతాఫ్రికాకు ఈ గెలుపు దక్కాల్సిందే. సిరీస్ మొత్తం వారు ఆధిపత్యం చెలాయించారు. అయితే క్రికెట్‌ను ఏ మాత్రం తేలికగా తీసుకోవద్దనే విషయం మరోసారి స్పష్టమైంది. సొంతగడ్డపై ఆడుతున్నామనే అడ్వాంటేజ్ ఉన్నా.. కొన్నిసార్లు మ్యాచ్‌లో ముందంజలో నిలిచినా.. వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాం. ఈ ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని మరింత మెరుగవ్వాలి. సొంతగడ్డపై ఆడినా.. విదేశాల్లో ఆడినా.. క్రికెట్ ఎప్పుడూ ఆటగాళ్ల నుంచి పట్టుదల, ప్రయత్నాన్ని డిమాండ్ చేస్తుంది. బ్యాటింగ్ విభాగం సమష్టిగా విఫలమైంది. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఈ సిరీస్‌లో మాకు ఉన్న ఏకైక సానుకూల అంశం ఏంటంటే.. మా సొంత ప్రణాళికపై ఫోకస్ పెట్టడం.'అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు.

## పాకిస్థాన్ కంటే దిగజారిన భారత్

సౌతాఫ్రికాతో ఘోర పరాజయం అనంతరం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్స్ టేబుల్‌లో భారత్ స్థానం దిగజారింది. దాయాదీ పాకిస్థాన్ కంటే భారత్ స్థానం కిందకు పడిపోయింది. సౌతాఫ్రికాతో బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో రిషభ్ పంత్ సారథ్యంలోని భారత జట్టు 408 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ ఘోర పరాజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో కోల్పోయింది. 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. 93 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో సొంతగడ్డపై ఇది మూడో క్లీన్ స్వీప్ కాగా.. వరుసగా రెండోది. ఈ రెండు పరాజయాలు కూడా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పర్యవేక్షణలోనే ఎదురు కావడం భారత టెస్ట్ క్రికెట్ భవిష్యత్తుపై ఆందోళన రేకెత్తిస్తోంది. తాజా పరాజయంతో డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో టీమిండియా ఏకంగా ఐదో స్థానానికి పడిపోయింది. శత్రు దేశం పాకిస్థాన్ భారత్ కంటే ముందు నిలవడం చూసి అభిమానులు జీర్ణించుకోలేకపోతునన్నారు. ఇంగ్లండ్ పర్యటనతో డబ్ల్యూటీసీ 2027 సైకిల్ ప్రారంభించిన భారత్ ఇప్పటి వరకు 9 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో నాలుగు గెలిచి మరో నాలుగు మ్యాచ్‌ల్లో ఓడింది. మరో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. అగ్రస్థానంలో ఆస్ట్రేలియా కొనసాగుతుండగా.. సౌతాఫ్రికా రెండో స్థానంలో నిలిచింది. శ్రీలంక, పాకిస్థాన్ భారత్ కంటే ముందున్నాయి. గత రెండేళ్లలో సొంతగడ్డపై భారత టెస్ట్ టీమ్‌కు ఇది రెండో వైట్‌వాష్. గతేడాది ఇదే సమయంలో భారత్ 0-3తో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్ అయ్యింది. ఈ పరాజయంతో డబ్ల్యూటీసీ 2025 ఫైనల్ బెర్త్‌ను దక్కించుకోలేకపోయింది. అప్పుడు కూడా స్పిన్ పిచ్‌లపై భారత బ్యాటర్లు విఫలమై మూల్యం చెల్లించుకున్నారు. ఆ తర్వాత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా ఓడిపోగా.. సీనియర్ ఆటగాళ్లు అయిన రవిచంద్రన్ అశ్విన్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. టెస్ట్ టీమ్ పగ్గాలు అందుకున్న శుభ్‌మన్ గిల్.. ఇంగ్లండ్ గడ్డపై అద్భుత ప్రదర్శన కనబర్చి ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేశాడు. కానీ తాజా సిరీస్‌కు అతను గాయంతో దూరం కాగా.. టీమిండియా మునపటి ఫలితాన్నే రిపీట్ చేసింది. ఈ సిరీస్ తర్వాత టీమిండియాకు టెస్ట్‌ల్లో సుదీర్ఘ విరామం దొరకనుంది. వచ్చే ఏడాది అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడనున్న భారత్.. మళ్లీ 2027లోనూ టెస్ట్ సిరీస్‌లు ఆడనుంది. ఈ సుదీర్ఘ విరామాన్ని టీమిండియా టెస్ట్ టీమ్ బలోపేతానికి ఉపయోగించుకోవాలనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సొంతగడ్డపై పిచ్‌ల తయారి విధానంపై పునరాలోచన చేయాల్సి ఉంది. 2027లో సొంతగడ్డపై టీమిండియా ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఆ లోపు టీమిండియా స్పెషలిస్ట్ టెస్ట్ బ్యాటర్లను తయారు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

# ఆస్ట్రేలియాపై గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలి

## టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

## ప్రజల నుంచి మద్దతు అద్భుతం: రోహిత్ శర్మ




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించాలని ఉందని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. అహ్మదాబాద్ వేదికగా జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియాపై గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలనే కసితో ఉన్నామని తన మనసులోని మాటను బయటపెట్టాడు. అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ మంగళవారం ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకటన కార్యక్రమానికి సూర్యకుమార్ యాదవ్‌తో పాటు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, భారత మహిళల వన్డే సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అప్‌కమింగ్ టీ20 టోర్నీకి రోహిత్ శర్మను బ్రాండ్ అంబాసిడర్‌గా ఐసీసీ నియమించింది. షెడ్యూల్ ప్రకటన సందర్భంగా హోస్ట్ జతిన్ సప్రు ఫైనల్లో ఏ జట్టును ఓడించాలనుకుంటున్నారని సూర్యకుమార్ యాదవ్‌ను ప్రశ్నించాడు. అందుకు సూర్య.. 'అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆస్ట్రేలియాను ఓడించాలనుకుంటున్నాం.'అని నవ్వుతూ బదులిచ్చాడు. ఇదే వేదికగా జరిగిన పురుషుల వన్డే ప్రపంచకప్ 2023 టోర్నీ ఫైనల్లో భారత్ ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో ఓటమెరుగని జట్టుగా ఫైనల్ చేరిన భారత్.. ఆస్ట్రేలియా చేతిలో మాత్రం ఖంగుతిన్నది. తృటిలో టైటిల్ చేజార్చుకుంది. ఈ క్రమంలోనే అదే మైదానంలో ఆస్ట్రేలియాను ఓడించి ప్రతీకారం తీర్చుకునే యోచనలో తమ జట్టు ఉందని సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ఈ టోర్నీలో పాకిస్థాన్, యూఎస్‌ఏ, నెదర్లాండ్స్, నమీబియాతో భారత్ గ్రూప్-ఏలో ఉంది. ఫిబ్రవరి 7న అమెరికాతో ముంబై వేదికగా జరిగే మ్యాచ్‌తో టీమిండియా తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. గ్రూప్-ఏ చాలా బాగుందని చెప్పిన సూర్యకుమార్ యాదవ్.. టీ20ల్లో ఎప్పుడు ఏ జట్టు బాగా ఆడుతుందో చెప్పలేమన్నాడు. ఇద్దరు బ్యాటర్లు, ఇద్దరు బౌలర్లు సత్తా చాటితే ఫలితం మారిపోతుందని అని చెప్పుకొచ్చాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ కుర్రాళు ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటారని సూర్య తెలిపాడు. ఆసియా కప్‌లో ఆ జట్టుతో తమకు మంచి అనుభవం దక్కిందని గుర్తు చేసుకున్నాడు. తమ ఫోకస్ ఎప్పుడూ క్రికెట్‌పైనే ఉంటుందని, ఇతర విషయాలను పట్టించుకోమని నవ్వుతూ బదులిచ్చాడు. ప్రపంచకప్‌లో పాక్‌తో పోరు మంచి మ్యాచ్ అవుతుందని చెప్పాడు. రోహిత్ శర్మ మాత్రం ఏ జట్టుతోనైనా పర్లేదని, కానీ భారత్ ఫైనల్ చేరాలని, విజేతగా నిలవాలని కోరుకుంటున్నానని తెలిపాడు. 'టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భారత్ ఫైనల్ చేరాలని కోరుకుంటున్నా. గతంలో జరిగిందేదో జరిగిపోయింది(వన్డే ప్రపంచకప్ ఓటమి). అదే స్టేడియంలో ఆస్ట్రేలియాను ఫైనల్లో ఓడించాలని సూర్య ఎంతో బాధతో చెప్పాడు. భారత్.. ఏ జట్టుతో ఫైనల్స్ ఆడినా.. విజేతగా చూడాలని కోరుకుంటున్నా.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా విజేతగా నిలవాలని తాను కోరుకుంటున్నానని మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. ప్రత్యర్థి ఎవరనేది అనవసరమని టీమిండియా ఫైనల్ చేరడమే ముఖ్యమన్నాడు. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ ఓటమికి ప్రతీకారం అవసరం లేదని, జరిగిందేదో జరిగిపోయిందని తెలిపాడు. సూర్యకుమార్ యాదవ్ బాధలో ఆసీస్‌ను ఓడించాలనే మాట అన్నాడని చెప్పాడు. హోస్ట్ జతిన్ సప్రు ఫైనల్లో ఏ జట్టును ఓడించాలనుకుంటున్నారని సూర్యకుమార్ యాదవ్‌ను ప్రశ్నించగా.. 'అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆస్ట్రేలియాను ఓడించి ప్రతీకారం తీర్చుకుంటాం'అని నవ్వుతూ బదులిచ్చాడు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన రోహిత్ శర్మ గతం గతః అని, ఫైనల్లో ప్రత్యర్థి ఎవరా? అనేది అనవసరమని అభిప్రాయపడ్డాడు. 'టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భారత్ ఫైనల్ చేరాలని కోరుకుంటున్నా. గతంలో జరిగిందేదో జరిగిపోయింది(వన్డే ప్రపంచకప్ ఓటమి). అదే స్టేడియంలో ఆస్ట్రేలియాను ఫైనల్లో ఓడించాలని సూర్య ఎంతో బాధతో చెప్పాడు. భారత్.. ఏ జట్టుతో ఫైనల్స్ ఆడినా.. విజేతగా చూడాలని కోరుకుంటున్నా. ఈ టోర్నీ భారత్‌లో జరుగుతుండటం గొప్ప విషయం. బ్రాండ్ అంబాసిడర్‌గా కొత్త పాత్రలో ఈ టోర్నీతో అనుబంధం కలిగి ఉండటం చాలా సంతోషంగా ఉంది. ఈ టోర్నీలో పాల్గొనే 20 జట్లకు నా శుభాకాంక్షలు. వారికి మంచి అనుభూతి దక్కాలని, భారతదేశ ఆతిథ్యాన్ని ఆస్వాదించాలని కోరుకుంటున్నా. ఈ టోర్నీ కోసం మా కుర్రాళ్లు ఉత్సాహంగా ఉన్నారు. భారత జట్టు తరఫున మైదానంలోకి దిగినప్పుడు ఆ భావోద్వేగం చాలా భిన్నంగా ఉంటుంది. సొంతగడ్డపై ఆడటం భిన్నమైన అనుభూతినిస్తోంది. ఒత్తిడి కూడా ఉంటుంది. కానీ ప్రజల నుంచి వచ్చే మద్దతు మాత్రం అద్భుతం.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

# ఫ్యాన్స్‌కు బాలయ్య 'డబుల్' ట్రీట్




బాలకృష్ణ ప్రస్తుతం హిట్ కాంబినేషన్ ను రిపీట్ చేస్తున్నాడు. తనకు ఇప్పటికే తనకు సింహా, లెజెండ్, అఖండ వంటి హిట్స్ ఇచ్చిన దర్శకుడు బోయపాటి శ్రీనుతో నాల్గోసారి 'అఖండ 2 తాండవం' సినిమాతో పలకరించబోతున్నాడు. ఈ సినిమా డిసెంబర్ 5న ప్యాన్ ఇండియా లెవల్లో తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ, భోజ్ పురి, అవధ్ భాషల్లో విడుదల కాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ అఖండ 2 తాండవం పై అంచనాలు పెంచేశాయి. ఈ సినిమా తెలుగు రాష్ట్రాలతో పాటు హిందీలో భారీ బిజినెస్ చేసినట్టు సమాచారం. అంతేకాదు బాలకృష్ణ కెరీర్ లో తొలి ప్యాన్ ఇండియా చిత్రం ఇదే కావడం గమనార్హం. ఓ హీరో సినిమా 65 యేళ్ల వయసులో ప్యాన్ ఇండియా లెవల్లో విడుదల కావడం అనేది మాములు విషయం కాదు. రజనీకాంత్, కమల్ హాసన్, చిరంజీవి, మోహన్ లాల్ తర్వాత ఈ ఏజ్ లో ప్యాన్ ఇండియా వ్యాప్తంగా తన సినిమాను విడుదల చేసిన సీనియర్ హీరోగా బాలయ్య రికార్డులకు ఎక్కాడు. తాజాగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో చేస్తోన్న చిత్రంలో చారిత్రక పాత్రలో కనువిందు చేయబోతున్నాడు. ఈ మూవీలో బాలకృష్ణ మరోసారి డ్యూయల్ రోల్లో చేయబోతున్నట్టు తెలుస్తుంది. ఇద్దరు రాజులు కత్తితో పట్టుకున్న ఫోటో ను విడుదల చేశారు. వీరసింహారెడ్డి తర్వాత మరోసారి గోపీచంద్ మలినేనితో మరోసారి డ్యూయల్ రోల్ ఫార్ములాతోనే ఆడియన్స్ ముందుకు రాబోతున్నాడు. ఇక బాలయ్య, బోయపాటి శ్రీను విషయానికొస్తే.. వీళ్ల కాంబినేషన్ లో వచ్చిన అన్ని సినిమాల్లో బాలకృష్ణ డ్యూయల్ రోల్స్ చేయడం విశేషం. తాజాగా గోపీచంద్ మలినేని .. బాలకృష్ణ తో చేయబోతున్నది చారిత్రక నేపథ్యమున్న సినిమా. ఈ సినిమా పూజా కార్యక్రమానికి ఏపీ మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ హాజరై స్క్రిప్ట్ ను నిర్మాతలకు అందజేశారు. బి.గోపాల్ తొలి షాట్ కు క్లాప్ కొట్టారు. బాలయ్య చిన్న కూతురు తేజస్విని కెమెరా స్విచ్చాన్ చేశారు. ఫస్ట్ షాట్ కు బాబీ, బోయపాటి శ్రీను, బుచ్చిబాబు సమిష్టిగా డైరెక్ట్ చేశారు. ఈ కార్యక్రమానికి స్టార్ దర్శకులు, అనేక మంది నిర్మాతలు హాజరయ్యారు.



## ఆస్కార్ రేసులో మహావతార్ నరసింహ..!

సినీ ప్రపంచంలో సంచలనాన్ని రేపిన యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ' విడుదలైన సమయంలో,భారత్‌లో యానిమేషన్ సినిమాలు పెద్దగా ఆదరణ పొందవని భావన ఉండేది. అయితే ఆ అంచనాలను పూర్తిగా తారుమారు చేస్తూ ఈ చిత్రం అద్భుతమైన విజయాన్ని అందుకుంది. అశ్విన్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీని హెూం బలే సంస్థ సుమారు రూ.40 కోట్ల బడ్జెట్‌తో నిర్మించింది. థియేటర్లకు వచ్చిన వెంటనే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా, దేశవ్యాప్తంగా భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీర్ఘకాలిక ప్రదర్శనలో రూ.325 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అనేక రికార్డులను తిరగరాసింది. ఇప్పటికే తనదైన మార్క్ వేసుకున్న 'మహావతార్ నరసింహ' ఇప్పుడు మరో అరుదైన ఘనతను అందుకుంది ౧ అదే ఆస్కార్ రేసులో ప్రవేశించడం. ఇటీవల ప్రకటించిన ఆస్కార్ ప్రాథమిక జాబితాలో ఈ చిత్రానికి స్థానం దక్కింది. యానిమేషన్ విభాగంలో మొత్తం 35 చిత్రాలు నామినేషన్ కోసం పోటీపడుతున్నాయి. ఆ జాబితాలో 'మహావతార్ నరసింహ' కూడా ఉండటం గర్వకారణం. ఈ 35 చిత్రాల్లోంచి ఒక్కటిని అధికారిక నామినేషన్ కోసం ఎంపిక చేస్తారు. ఆ ఎంపికలో 'మహావతార్' నిలిస్తే, ఇండియా నుంచి ఆస్కార్ నామినేషన్‌కు ఎంపికైన తొలి యానిమేషన్ చిత్రం అనే చరిత్ర సృష్టిస్తుంది. అంతేకాక, నామినేషన్ దశను దాటితే, అవార్డు అందుకునే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఎన్టీఆర్ సినిమా టైటిల్ డ్రాగన్ కాదా?




టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ – 'కేజీఎఫ్' డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కుతున్న సినిమా 'డ్రాగన్ '. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా మూవీపై సినీ వర్గాల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో 'కాంతార' బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ఫస్ట్ లుక్‌లు అభిమానుల్లో అంచనాలను ఆకాశానికి చేరాయి. అయితే, ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కు 'డ్రాగన్' అనే పేరు ఫైనల్ కాలేదని నిర్మాతలు చెప్పడం హాట్ టాపిక్ గా మారింది. ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ #NTR31. ప్రస్తుతం వర్కింగ్ టైటిల్ 'డ్రాగన్' అనే పేరు పెట్టారు. ఈ సినిమా 2024 చివర్లో అధికారికంగా అనౌన్స్ అయినప్పటికీ, ప్రిత్విరాజ్ సుకుమారన్, రాజమౌళి వంటి వాళ్లు 'డ్రాగన్' అని పలు సందర్భాల్లో ప్రస్తావించడంతో ఆ పేరే ఫైనల్ అన్న అభిప్రాయం ఏర్పడింది. దీంతో యాక్షన్, మాస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను థియేటర్లలో కట్టిపడేస్తుందని ఇండస్ట్రీలో గట్టి నమ్మకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ మూవీ టైటిల్ ఫైనల్ కాలేదని నిర్మాతలు మైత్రి మూవీ మేకర్స్ స్పష్టం చేశారు.తాజాగా నిర్మాత మైత్రి రవి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.." 'డ్రాగన్' కేవలం టెంటేటివ్ టైటిల్స్‌లో ఒకటి మాత్రమే. ఇంకా చాలా ఆప్షన్స్ పరిశీలిస్తున్నాం. మూవీ స్కేల్, ఎన్టీఆర్ క్యారెక్టర్ డిమాండ్‌కు తగ్గట్టు అంతర్జాతీయ స్థాయి టైటిల్ ఫిక్స్ చేస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జోరుగా సాగుతోంది. ఆఫస్ట్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత ఆఫ్రికాలో భారీ షెడ్యూల్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. 2026లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎన్టీఆర్ కెరీర్‌లో ఇది ఒక యూనివర్సల్ బ్లాక్‌బస్టర్ అవుతుందని టాలీవుడ్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.అయితే ఇప్పుడు మూవీ నిర్మాతల కామెంట్స్ తో ఇంతకీ సినిమా టైటిల్ ఏంటీ? అనే చర్చ మొదలైంది. ఇండస్ట్రీలో ఏ విషయం దాచాలని ప్రయత్నించినా.. బయటపడకుండా కాపాడటం చాలా కష్టం. ముఖ్యంగా మూవీ అప్డేట్స్, టైటిల్స్ విషయంలో మూవీ మేకర్స్ ఎంత జాగ్రత్త పడినా.. ఎప్పుడో ఒక్కసారి బయటపడుతునే ఉంటాయి. గతంలో కొరటాల శివ – మెగాస్టార్ చిరంజీవి కాంబో మూవీ ఆచార్య సినిమా టైటిల్‌ను, అధికారికంగా ప్రకటించే ముందే చిరంజీవి స్వయంగా ఒక ఈవెంట్‌లో పొరపాటున బయటపెట్టారు. వెంటనే సారీ చెప్పినా, అప్పటినుంచి "మెగా లీక్స్" అనే పదం ఇండస్ట్రీలో బాగా ప్రాచుర్యం పొందింది.



## చిన్న సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది



అఖిల్ రాజ్, తేజస్వినీ ప్రధాన జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' విడుదలైన వెంటనే ప్రేక్షకుల ప్రేమను సంపాదించి, థియేటర్లలో విజయవంతంగా దూసుకుపోతోంది. హృదయాన్ని హత్తుకునే ప్రేమకథగా విమ- ర్శకులు, ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు అందుకుంటోంది. మొదటి రోజు నుంచే మంచి ఓపెనింగ్స్ నమోదవడంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దృఢమైన స్థాయి సాధించింది. తాజాగా బయటకు వచ్చిన వసూళ్ల సమాచారం ప్రకారం, ఈ సినిమా మొదటి మూడ్రోజుల్లో రూ. 7.28 కోట్లు గ్రాస్ రాబట్టింది. ప్రత్యేకత ఏమిటంటే రోజు రోజుకు కలెక్షన్లు పెరుగుతూ వస్తుండటం. తొలి రోజు కంటే రెండో రోజు, రెండో రోజు కంటే మూడో రోజు కలెక్షన్లు మరింత మెరుగ్గా రావడం చిత్ర విజయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్‌పై ఈ చిత్రాన్ని వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించిన ఈ సినిమాను వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ భారీగా థియేటర్లలో విడుదల చేశారు. ఈ చిత్రంలో అఖిల్ రాజ్, తేజస్వినీ రావ్‌తో పాటు శివాజి రాజా, చైతు జొన్నలగడ్డ, అనిత చౌదరి, కవిత శ్రీరంగం తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.

## ఆన్‌లైన్ వేధింపులపై సమంత పోరాటం



ప్రముఖ నటి సమంత, మహిళలపై ఆన్‌లైన్‌లో పెరుగుతున్న వేధింపులను ఎదుర్కోవడానికి ముందుకు వచ్చారు. ఈ లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పనిచేస్తున్న 'యూఎన్ విమెన్ ఇండియా'తో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. మహిళలపై డిజిటల్ ప్రపంచంలో జరుగుతున్న హింసను నివారించేందుకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకూ జరుగనున్న 16 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో తాను పాల్గొంటున్నట్లు సమంత ఇప్పటికే తెలియజేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా ద్వారా తన 37 మిలియన్ల అనుచరులను ఉద్దేశించి మాట్లాడిన ఆమె, ఆన్‌లైన్ వేధింపులపై తన అనుభవాలను వెల్లడించారు. "సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు, బెదిరింపులు, డీప్ ఫేక్ చిత్రాలు వంటి అనేక రూపాల్లో మహిళలు దాడులకు గురవుతున్నారు. గతంలో ప్రత్యక్షంగా జరిగే ఈ వేధింపులు ఇప్పుడు డిజిటల్ ప్రపంచానికి మారాయి. ఇవి మనసును దెబ్బతీసేలా, ఆత్మవిశ్వాసాన్ని తగ్గించేలా ఉంటాయి," అని సమంత భావోద్వేగంతో తెలిపారు. తాను కూడా ఇలాంటి పరిస్థితులను పలుమార్లు ఎదుర్కొన్నానని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం మహిళల్లో ఆన్‌లైన్ హింసపై అవగాహన పెంపొందించడం అని సమంత వివరించారు. డిజిటల్ వేధింపులను అరికట్టేందుకు మరింత ప్రభావవంతమైన వ్యవస్థలు, కఠినమైన చట్టాలు తప్పనిసరిగా అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. యూఎన్ విమెన్ ఇండియా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగం కావడం తనకు గర్వకారణమని సమంత పేర్కొన్నారు.

## రామ్‌ను లవ్ యూ అనేసిన భాగ్యశ్రీ

రెండ్రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రా కింగ్ తాలూకా మ్యూజిక్ కాన్సర్ట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. రామ్‌పై ప్రశంసల వర్షం కురిపించింది. మీరు కింగ్ ఆఫ్ హార్ట్స్... ఐ లవ్ యూ అంటూ అందరిముందు ఓపెన్ అయ్యింది. దాంతో భాగ్యశ్రీ – రామ్‌ల మధ్య ఏదో జరుగుతుందని జనాలు ఫిక్స్ అయ్యారు. ఇంత జరుగుతున్నా రామ్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం కూడా అనేక అనుమానాలకు తావిచ్చింది. తాజాగా భాగ్యశ్రీ భోర్సేతో ప్రేమాయణంపై రామ్ పోతినేని స్పందించారు. ఆంధ్రా కింగ్ తాలూకా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఛానెల్‌తో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 16 ఏళ్లకే కెరీర్ ప్రారంభించారు, చాలామంది హీరోయిన్స్‌తో వర్క్ చేశారు. ఇప్పటి వరకు మీ గురించి ఒక్క రూమర్ లేదు.. కానీ ఈ ఫిల్మ్‌కు ఎందుకో రూమర్స్ బయటికొచ్చాయని ఓ విలేకరి ప్రశ్నించారు. దీనికి రామ్ స్పందిస్తూ.. ఈ సినిమాకు పాట రాసినప్పటి నుంచి ఇది స్టార్ట్ అయ్యింది. లేకపోతే ఎందుకు స్టార్ట్ అవుతుంది. ఇప్పటి వరకు పాట రాయలేదు, ఫస్ట్ టైం పాట రాశా. ఈ సాంగ్ రాసేసరికి హీరోయిన్ ఎంపిక కూడా జరగలేదని రామ్ తెలిపారు. దాంతో భాగ్యశ్రీ భోర్సేతో తాను డేటింగ్ చేస్తున్నట్లుగా వస్తున్న ఊహాగానాలకు రామ్ పోతినేని చెక్ పెట్టినట్లయ్యింది. కాగా కెరీర్‌లో చాలా మంది హీరోయిన్లతో వర్క్ చేసినప్పటికీ రామ్ గురించి పెద్దగా ఎలాంటి రూమర్స్ రాలేదు. అలాంటిది భాగ్యశ్రీ భోర్సేతో ఆయన డేటింగ్ చేస్తున్నాడంటూ వార్తలు రావడం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. దీనికి కారణాలు లేకపోలేదు. రామ్, భాగ్యశ్రీలు పోస్ట్ చేసిన ఫోటోలు, వీడియోలలో బ్యాక్‌గ్రౌండ్, వస్తువులు ఒకేలా ఉండటంతో వీరిద్దరి మధ్య ఏదో జరుగుతుందన్న రూమర్స్‌కు బలం చేకూరేలా చేశాయి. ఇక ఎన్నడూ లేని విధంగా రామ్ పోతినేని రచయితా మారి ఈ సినిమా కోసం ఓ సాంగ్ కూడా రాశాడు. ఇది భాగ్యశ్రీని ఉద్దేశించి రాసినదేనని గాసిప్స్ వైరల్ అయ్యాయి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463